

'దేశం'లో లుకలుకలు!

లోకేశ్ జన్మదిన వేడుకల్లో బయటపడిన విభేదాలు

- పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యేలు డుమ్మా
- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ నిర్వహించిన కార్యక్రమానికి హాజరు



టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న ఎంపీ శ్రీభరత్. చిత్రంలో గండి బాబ్జీ, ఇతర నాయకులు ఉన్నారు

విశాఖపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):

తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖా మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకల నిర్వహణలో జిల్లా నేతల మధ్య ఉన్న విభేదాలు బయటపడ్డాయి. గురువారం నగరంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన లోకేశ్ జన్మదిన వేడుకలకు ఎంపీ ఎం.శ్రీభరత్, విశాఖ పార్లమెంటరీ నియోజకవర్గ పార్టీ అధ్యక్షుడు గండి బాబ్జీ, ప్రధాన కార్యదర్శి పోలమరశెట్టి శ్రీనివాస్, దక్షిణ ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, పార్టీ నాయకులు కోరాడ ... మిగతా 6వ పేజీలో

కూటమి విజయంలో లోకేశ్ పాత్ర కీలకం

రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

- యువగళం పాదయాత్రతో ఏపీలో సరికొత్త అధ్యాయం సృష్టించారు
- ఘనంగా మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు

సిరిపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):

కూటమి అధికారంలోకి రావడంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాత్ర కీలకమని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గురువారం సిరిపురంలోని చిల్డ్రన్స్ ఎరీనాలో వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ ఆధ్వర్యంలో మంత్రి నారా లోకేష్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అచ్చెన్నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు ... మిగతా 6వ పేజీలో



మంత్రి నారా లోకేశ్ జన్మదినం సందర్భంగా గురువారం సిరిపురం జంక్షన్‌లో గల వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో భారీ కేక్ కట్ చేసిన అనంతరం మాట్లాడుతున్న వ్యవసాయ శాఖా మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు. చిత్రంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, పీవీజీఆర్ నాయుడు (గణబాబు), పంచకర్ల రమేష్‌బాబు, పీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ ఉన్నారు.

కలెక్టర్, సీపీలకు ఎన్నికల సంఘం అవార్డులు




కలెక్టర్ హరేంధిరప్రసాద్, సీపీ బాగ్చీ

విశాఖపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):

గత ఏడాది సాధారణ ఎన్నికల నిర్వహణ, తదనంతరం ఓటర్ల ప్రత్యేక సంక్షిప్త సవరణ-2025 జాబితా రూపకల్పనలో ఉత్తమ పనితీరు కనబరచినందుకు విశాఖపట్నం జిల్లా కలెక్టర్‌కు ఎన్నికల సంఘం అవార్డు ప్రకటించింది. ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్లు, ఎస్పీలు, పోలీస్, రెవెన్యూ ఉన్నతాధికారులు, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు, బూత్ లెవెల్ అధికారులకు బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ అవార్డులు అందజేస్తారు. ఈ ఏడాదికిగాను విశాఖ కలెక్టర్ హరేంధిరప్రసాద్, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, విశాఖ ఆర్డీవోగా పనిచేసిన డి.హుస్సేన్ సాహెబ్, భీమిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని జోన్-2లో సహాయ సిటీ ప్లానర్ పి.హరిబాబు, 281 పోలింగ్ స్టేషన్ బీఎల్‌వో కిరణ్మయి, పెందుర్తి పరిధిలోని 251 పోలింగ్ స్టేషన్ బీఎల్‌వో ఎస్.అనురాధలను ఎంపిక చేసింది. ఈనెల 25వ తేదీన విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరగనున్న కార్యక్రమంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతులమీదుగా వీరంతా అవార్డులు తీసుకోనున్నారు.

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

విశాఖపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):

గ్రామ పంచాయతీల ఖాతాలకు 15వ ఆర్థిక సంఘం నిధులు జమ అయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 15వ ఆర్థిక సంఘం నుంచి తొలి విడత గ్రాంటు కింద జిల్లాలోని 79 గ్రామ పంచాయతీలకు రూ.3.78 కోట్లు జమచేశారు. టైడ్ గ్రాంటు కింద రూ.2.26 కోట్లు, అన్‌టైడ్ గ్రాంటు కింద రూ.1.51 కోట్లు విడుదలయ్యాయి. టైడ్ గ్రాంటు కింద విడుదల చేసిన నిధులను శానిటేషన్, నీటి సరఫరాకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అన్‌టైడ్ గ్రాంటు కింద వచ్చిన నిధులను పాలనాపరమైన ఖర్చులు అంటే జీతాలు, ఇతరత్రా నిర్వహణకు వినియోగించాలని ... మిగతా 6వ పేజీలో

బడా బాబులకు సహకారం

సూపర్ బజార్ స్థలం లీజు పేరిట సుహానీ సంస్థకు కేటాయింపు

- అక్కడ నుంచి చేతులు మారిన షాపింగ్ మాల్
- ఫ్యూచర్ గ్రూపు నుంచి రిలయన్స్ చేతికి
- విశాఖ సెంట్రల్ పేరు 'సెంట్రో'గా మార్పు
- అంతా నిబంధనలకు విరుద్ధం
- కళ్లు మూసుకున్న అధికారులు
- అద్దె సక్రమంగా చెల్లిస్తున్నారని సన్నాయి నొక్కులు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ (సూపర్ బజార్) అధికారులు అవినీతి బాగోతం బయటపడినా ఇంకా నంగనాచి కబుర్లు చెబుతూ అందరినీ తప్పుదోవ పట్టిస్తున్నారు. షాపింగ్ మాల్‌కు అద్దెకు ఇచ్చిన స్థలాన్ని ఆ సంస్థ బ్యాంకులో తనఖా పెట్టి రూ.350 కోట్ల రుణం తీసుకున్నా తమకు ఏమీ తెలియదని బుకాయిస్తున్నారు. ఆ విషయం బ్యాంకు నోటీసు ఇచ్చాకే తమకు తెలిసిందని అంటున్నారు.



సూపర్‌బజార్‌కు చెందిన స్థలంలో నిర్మించిన షాపింగ్‌మాల్

గత ఏడాది ఆడిట్ నిర్వహించినప్పుడు బ్యాంక్ నోటీసు సంగతి వెలుగులోకి రావడంతో వెంటనే 51 విచారణకు ఆదేశించినట్టు సూపర్ బజార్ మేనేజింగ్ డైరెక్టర్ డి.శ్రీనివాసరాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. నెల నెలా వారు అద్దె కడుతున్నారని కూడా పేర్కొన్నారు. నిందితులు ఎవరో తేలితే చర్యలు తప్పవన్నారు. ఈ కేసులో తమకు ఏమీ తెలియదన్నట్టుగా సహకార శాఖ అధికారులు అమాయకంగా చెబుతున్నారు. కానీ అన్నీ అందరికీ తెలిసే జరిగాయి. కానీ ఇంకా బుకాయించే ప్రయత్నం చేస్తున్నారు.

భవనం మొత్తం సబ్ లీజుకు ఇచ్చేశారు

దీర్ఘకాలిక లీజుకు తీసుకున్న భూమిలో షాపింగ్ మాల్ నిర్మించి, నెల నెలా అద్దె కడుతూ, 33 ఏళ్లు ముగిసిన తరువాత భవనం కో-ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ (సూపర్‌బజార్) యాజమాన్యానికి వదిలేసి వెళ్లిపోతామని సుహానీ ట్రేడింగ్ సంస్థ ఒప్పందం చేసింది. కానీ అడుగడుగునా నిబంధనలు ఉల్లంఘించింది. సుహానీ మాల్ అనేది 'ఫ్యూచర్' కార్పొరేట్ కంపెనీలో ఓ విభాగం. ఫ్యూచర్ గ్రూపునకు అధిపతి కిశోర్ బియానీ. ఆయన సూపర్ బజార్ అధికారులను మచ్చిక చేసుకొని టైటిల్ డీడ్ తీసుకున్నారు. దానిని ముంబైలోని ఆర్‌బీఎల్ బ్యాంకులో తనఖా పెట్టి భారీ రుణం పొందారు. కరోనా తరువాత దివాలా తీయడంతో దానిని తిరిగి తీర్చలేకపోయారు. ఆయన ఈ అప్పుల నుంచి బయటపడడానికి దేశవ్యాప్తంగా తనకున్న బిగ్ బజారు మాల్స్‌ను, సెంట్రల్ షాపింగ్ మాల్స్‌ని, బ్రాండ్ ఫ్యాక్టరీ అవుట్‌లెట్లను గంపగుత్తగా రిలయన్స్ గ్రూపునకు అమ్మేశారు. ఇదంతా 2022 సెప్టెంబరులో జరిగింది. ఈ డీల్ ముగిసిన తరువాత రిలయన్స్ యాజమాన్యం రంగంలోకి దిగి బిగ్ బజార్లను రిలయన్స్ స్మార్ట్ బజార్లుగా, సెంట్రల్ షాపింగ్ మాల్స్‌ను.. సెంట్రో మాల్స్‌గా పేర్లు మార్చింది. ఇలా దేశంలో 200 బిగ్ బజార్లను, 34 సెంట్రల్ మాల్స్‌ను, 78 బ్రాండ్ ఫ్యాక్టరీ ... మిగతా 6వ పేజీలో

ఇదీ నేపథ్యం

- సూపర్ బజారుకు, సుహానీకి మధ్య 18.8.2005న 33 ఏళ్లకు ప్రాథమిక ఒప్పందం జరిగింది.
- ముందు 4,270 గజాల భూమి ఇవ్వాలనుకున్నారు. జాయింట్ సర్వే నిర్వహించాక దానిని 3,972 గజాలకు మార్చారు.
- ఇరు సంస్థల మధ్య 23.04.2008న రిజిస్టర్డ్ ఒప్పందం జరిగింది.
- 2018-19 మధ్య ఫ్యూచర్ గ్రూపు టైటిల్ డీడ్ తాకట్టు పెట్టి రూ.350 కోట్ల రుణం తీసుకుంది. ఆ తరువాత దివాలా తీసింది.

విశాఖ-దుర్గ్

వందే భారత్ కోచ్‌లలో కోత

నేటి నుంచి 8 కోచ్‌లే...

- ఆదరణ తక్కువగా ఉండడంతో అధికారుల నిర్ణయం
- సికింద్రాబాద్ వందేభారత్‌కు డిమాండ్ ఉండడంతో గత వారం నుంచి అదనంగా నాలుగు కోచ్‌లు జత



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ప్రయాణికుల ఆదరణకు అనుగుణంగా వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో అధికారులు మార్పులు, చేర్పులు చేస్తున్నారు. ఆదరణ బాగుంటే కోచ్‌ల సంఖ్య పెంచడం, లేకుంటే తగ్గించడాన్ని 'ట్రైన్ సెట్'గా వ్యవహరిస్తారు. విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య డిమాండ్ అధికంగా ఉండడంతో వాటి కోచ్‌ల సంఖ్యను వారం క్రితం 16 నుంచి 20కి పెంచారు. విశాఖపట్నం-దుర్గ్‌కు ఆక్యుపెన్సీ పెద్దగా లేకపోవడంతో శుక్రవారం నుంచి కోచ్‌లను తగ్గించబోతున్నారు.

నాలుగు, ఎనిమిది, పన్నెండు, పదహారు, ఇరవై, ఇరవై నాలుగు...ఇలా 'నాలుగు గుణిజాల'తో వందేభారత్ రైళ్లను నడుపుతున్నారు. విశాఖపట్నం-భువనేశ్వర్ మధ్య వందే భారత్ రైలు ఎనిమిది కోచ్‌లతో నడుస్తోంది. ఆక్యుపెన్సీ బాగానే ఉండడంతో వాటిని అలాగే కొనసాగిస్తున్నారు. విశాఖపట్నం నుంచి దుర్గ్‌కు గత ఏడాది సెప్టెంబరు 16న వందే భారత్ ప్రారంభించారు. దీనికి 16 కోచ్‌లు పెట్టారు. అయితే ఆదరణ చాలా తక్కువగా ఉంది. విశాఖ నుంచి దుర్గ్ (20830)కు 40 నుంచి 45 శాతమే ఆక్యుపెన్సీ ఉంటోంది. అటు నుంచి వచ్చేటపుడు ఆ రైలు (20829)లో దుర్గ్ నుంచి రాయగడ వరకు 50 శాతం వరకు, అక్కడి నుంచి విశాఖకు కేవలం 20 నుంచి 25 శాతమే ఉంటోంది. ఎక్కువ సీట్లు ఖాళీగా ఉంటున్నాయి. విశాఖపట్నం నుంచి పార్వతీపురానికి సాధారణ రైళ్లలో టికెట్ ధర కేవలం రూ.145 కాగా, వందే భారత్ ఎక్కితే రూ.565 చెల్లించాల్సి వస్తోంది. దాంతో రాయగడ నుంచి విశాఖ వరకూ తెలుగువారు ఎవరూ ఈ రైలును ఎక్కడం లేదు. దీనిపై చాలాకాలంగా రైల్వే అధికారులు మథన పడుతున్నారు. 'ట్రైన్ సెట్' చేసుకోవచ్చునని గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఇక్కడి అధికారులు కోచ్‌ల సంఖ్యను సగానికి కుదించారు. అంటే కేవలం ... మిగతా 6వ పేజీలో

టూరిజం మోడల్ సిటీగా విశాఖ

పర్యాటకులకు వసతుల కల్పనలో ప్రపంచ స్థాయి ప్రమాణాలు పాటించాలి

- తీరంలో కొత్తగా బీచ్‌లు అభివృద్ధి చేయాలి
- కంబాలకొండ, గంభీరం, తాటిపూడి రిజర్వాయర్లలో బోటింగ్
- జూ పార్కుకు అదనపు హంగులు అవసరం
- జిల్లా అధికారులతో ఏపీటీడీసీ వీసీ అండ్ ఎండీ ఆమ్రపాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీటీడీసీ వీసీ అండ్ ఎండీ ఆమ్రపాలి. పక్కన వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, జీసీసీ ఎండీ కల్పన కుమారి, విశాఖ పోర్టు సెక్రటరీ వేణుగోపాల్ తదితరులు.

విశాఖపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):

పర్యాటక రంగంలో మోడల్ సిటీగా విశాఖపట్నాన్ని తీర్చిదిద్దాలని ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ వైస్ చైర్‌పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆమ్రపాలి సూచించారు. జిల్లాలో పర్యాటక ప్రాజెక్టులు, ప్రణాళికలు, మౌలిక వసతుల ఏర్పాటు, భవిష్యత్తు కార్యాచరణ వంటి అంశాలపై ఆమె వీఎంఆర్‌డీఏ, పర్యాటకం, జీవీఎంసీ, జీసీసీ, విశాఖ పోర్టు, అటవీ శాఖ, హోటళ్ల యజమానులు, టూరిజం కౌన్సిల్ జిల్లా అధికారులతో గురువారం సమీక్షించారు. వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో ఆమ్రపాలి మాట్లాడుతూ, పర్యాటకులకు వసతులు కల్పించే విషయంలో ప్రపంచ స్థాయి ప్రమాణాలు పాటించాలన్నారు. టెంపుల్ టూరిజం, అడ్వంచర్ టూరిజం, ఎకో టూరిజం, వైల్డ్ లైఫ్ టూరిజం, మెడికల్ టూరిజం, క్రూయిజ్ టూరిజం వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. క్రూయిజ్ టూరిజానికి అవసరమైన టెర్మినల్‌ను విశాఖపట్నం పోర్టు నిర్మించినందున దానికి తగిన వసతులు సమకూర్చాలని సంబంధిత అధికారులకు సూచించారు. విశాఖ నుంచి భోగాపురం వరకు సువిశాలమైన సముద్రతీరం ఉన్నందున కొత్త బీచ్‌లను అభివృద్ధి చేయాలన్నారు. కంబాలకొండ, గంభీరం, తాటిపూడి రిజర్వాయర్లలో బోటింగ్ అవకాశాలు పరిశీలించాలన్నారు. జూ పార్కుకు అదనపు హంగులు అవసరమని అభిప్రాయపడ్డారు. కొత్త ప్రణాళికలు అందరికీ ఆమోదయోగ్యంగా ఉండేలా చూడాలన్నారు. వాటికి సంబంధించిన బడ్జెట్ ... మిగతా 6వ పేజీలో

పోలీసుల అదుపులో నకిలీ మహిళా ఐఏఎస్!

- ఉద్యోగాలిప్పిస్తానని పలువురి నుంచి డబ్బులు వసూలు
- బాధితుల ఫిర్యాదుతో ఎంవీపీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు



నకిలీ ఐఏఎస్ అధికారి

విశాఖపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):

ఐఏఎస్ అధికారినంటూ పలువురిని మోసగించి డబ్బులు వసూలుచేస్తున్న మహిళతోపాటు ఆమె భర్తను నగర పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. అమృత భాగ్యరేఖ అనే మహిళ ట్రైనీ ఐఏఎస్ అధికారినంటూ ఎంవీపీ కాలనీలో ఒక ఇల్లు అద్దెకు తీసుకుంది. ఆమె భర్తతో కలిసి కొంతకాలంగా హడావుడి చేయడం ప్రారంభించింది. ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలిప్పిస్తామంటూ పలువురి నుంచి దంపతులు డబ్బులు వసూలు చేస్తున్నారు. ప్రతిరోజూ చాలా మంది వచ్చిపోతుండడంతో ఇంటి యజమానికి అనుమానం కలిగింది. ఆరా తీయగా ఉద్యోగాల కోసం వచ్చివెళుతున్నట్టు తెలిసి షాక్‌కు గురయ్యారు. దీనిపై సీపీ శంఖబ్రతబాగ్చికి ఇంటి యజమాని ఫోన్ చేసి ఫిర్యాదుచేసినట్టు సమాచారం. సీపీ ఆదేశాలతో ఎంవీపీ పోలీసులు ఆమె ఉంటున్న ఇంటికి వెళ్లి విచారించగా, ఆమె నకిలీ ఐఏఎస్‌గా తేలింది. దీంతో దంపతులు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్టు తెలిసింది. ఉద్యోగాల కోసం డబ్బులు ... మిగతా 6వ పేజీలో

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

నగరానికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థిని మృతి

- ఇంటర్వ్యూ నిమిత్తం హైదరాబాద్ వెళుతుండగా ఘోరం
- ప్రమాదంలో మరో 20 మందికి గాయాలు



ప్రమాదానికి గురైన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు



మృతురాలు కళ్యాణి (ఫైల్ ఫొటో)

రాజమహేంద్రవరం సిటీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి):

రాజమహేంద్రవరం రూరల్ మండలం కాతేరు గ్రామ సమీపాన గురువారం తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో కావేరి ట్రావెల్స్‌కు చెందిన బస్సు బోల్తాపడడంతో విశాఖపట్నం మద్రిపాలేనికి చెందిన కోనా హాసిని కళ్యాణి (21) మృతిచెందింది. మరో 20 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు చెబుతున్నారు. క్షతగాత్రుల్లో అత్యధికులు విశాఖపట్నానికి చెందినవారిగా చెబుతున్నారు. కళ్యాణి విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాలతో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతోందని, ఇంటర్వ్యూ నిమిత్తం హైదరాబాద్ వెళుతుందని కుటుంబ సభ్యుల ద్వారా తెలిసింది. ఆమె తండ్రి రైల్వే ... మిగతా 6వ పేజీలో


భవనానికి మరమ్మతులు చేస్తున్న కూలీలు

శతాబ్ది ఉత్సవానికి హైస్కూల్ ముస్తాబు

భీమునిపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల శతాబ్ది ఉత్సవాలకు ముస్తాబవుతోంది. బుధవారం నుంచి పాఠశాలలోని భవనాలకు మరమ్మతులతో పాటు రంగులు వేయడం ప్రారంభించారు. వందేళ్లు పూర్తయిన ఈ పాఠశాల శతాబ్ది ఉత్సవాలను వచ్చే నెల 1, 2వ తేదీల్లో నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఈమేరకు భవనాలకు రంగులు వేసి, సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. జిల్లా డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారి సోమేశ్వరరావు, పాఠశాల హెచ్‌ఎం రమణ ఆధ్వర్యంలో పనులు జరుగుతున్నాయి.అలాగే ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలో పైలాన్ నిర్మాణం కూడా జోరుగా సాగుతోంది. కాగా ఉత్సవాలకు మంత్రి లోకేశ్ ముఖ్యఅతిథిగా హాజరుకానుండడంతో సభ జరిగే ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానాన్ని శరవేగంగా చదును చేస్తున్నారు.

అధ్యాపకులకు కొనసాగుతున్న శిక్షణ

సాగర్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : డిజిటల్ యుగంలో విద్యార్థులు అదనపు సమాచారం కోసం ఇంటర్నెట్ ద్వారా అనుసంధానం అవుతున్నారని, వారిని తరగతి గదిలో ఏకాగ్రతగా ఉంచాలంటే అధ్యాపకులు ప్రత్యేక నైపుణ్యాలు అలవరచుకోవాలని గీతం వర్సిటీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ వై. గౌతమ్ రావు సూచించారు. గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కేంద్రం ఆధ్వర్యంలో జరుగుతున్న అధ్యాపకుల శిక్షణలో గురువారం ఆయన మాట్లాడారు. విద్యార్థులతో ముఖాముఖి చర్చ, ఆలోచనలు రేకెత్తించే ప్రశ్నలు, సిలబస్‌లో లేని అదనపు సమాచారం అందించడం ద్వారా వారిలో కోర్సు పట్ల ఆసక్తి పెంచవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ విభాగం డైరెక్టర్ ప్రొఫెసర్ జీవీఆర్ శర్మ, తదితరులు పాల్గొన్నారు.


అనంతవరంలో రైతు భరోసా కేంద్రం పేరుతో ఉన్న భవనం


అనంతవరం సంపద తయారీ కేంద్రంలో వైసీపీ రంగులు

ప్రభుత్వం మారినా.. బోర్డులు మారలేదు

- ఇప్పటికీ వైసీపీ ప్రభుత్వ పథకాలతోనే కొనసాగింపు
- అధికారుల తీరుపై విమర్శలు

పద్మనాభం రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఎన్నికల్లో ఓటమి చెంది, కూటమి అధికారంలోకి వచ్చి కొన్ని నెలలు కావస్తోంది. కానీ మండలంలో కొంతమంది అధికారులు ఇంకా వైసీపీ పాలన నుంచి బయటకు రాలేకపోతున్నారు. అప్పటి పాలకులపై అభిమానమో లేక ఇప్పటి పాలనపై నిర్లక్ష్యమో తెలియదు గాని కూటమి ప్రభుత్వం ఏర్పడి ఇన్ని రోజులైనా ఇప్పటికీ పాత గుర్తులే కనిపిస్తున్నాయి. గత ప్రభుత్వం నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాల పేరును కూటమి రైతు సేవా కేంద్రాలుగా మార్చింది. అలాగే విలేజ్ క్లినిక్‌ల పేరును కూడా మార్చింది. కానీ మండలంలోని అనంతవరం, తునివలస, కోరాడ గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల భవనాలపై అప్పటి పేర్లు, అప్పటి సీఎం జగన్ ఫొటోలు ఇంకా దర్శనమిస్తున్నాయి. అలాగే కోరాడలో ఉన్న సంపద తయారీ కేంద్రం మొత్తం వైసీపీ రంగులు, ఫొటోలతో నిండిపోయింది. వీటిని తొలగించాలని స్థానిక నాయకులు సంబంధిత అధికారుల దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా.. ఎవరూ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.


ఆరోగ్య కేంద్రం భవనంపై విలేజ్ హెల్త్ క్లినిక్ పేరు

ఘనంగా మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు

భీమునిపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోనూ రాష్ట్ర మానవ వనరులు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. భీమిలిలోని టీడీపీ కార్యాలయంలో యువ నాయకుడు గంటా రవితేజ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి లోకేశ్ రాష్ట్రాభివృద్ధికి చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. నియోజకవర్గంలో పార్టీ సభ్యత్వాలు లక్ష దాటడంతో కార్యకర్తల కృషిని కొనియాడారు. తొలుత టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్, నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిత్రపటాలకు ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో నాయకులు యార్లగడ్డ జీవన్‌కుమార్, గంటా నూకరాజు, దంతులూరి అప్పలనరసింహరాజు, అక్కరమాని వెంకటరావు, కొప్పల రమేశ్, గాడు అప్పలనాయుడు, గొలగాని నరేంద్రకుమార్, పాసి నరసింగరావు, కార్పొరేటర్లు గాడు చిన్నికుమారిలక్ష్మి, మొల్లి హేమలత, లొడగల అప్పారావు, గరికిన ఎల్లయ్య (కింగ్), కురిమిన లీలావతి, బమ్మిడి ఉమ, బోయి రమాదేవి, మరుపిళ్ల రాజేంద్ర, సూరాడ రవి,మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు పాల్గొన్నారు.


భీమిలిలో వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న గంటా రవితేజ

మధురవాడ : లోకేశ్ జన్మదిన వేడుకలను ఏడో వార్డులో కూటమి నాయకులు ఘనంగా నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి పిళ్లా వెంకటరావు కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు నాగోతి సూర్యప్రకాశ్, కానూరి అచ్చుతరావు, నాగోతి శివాజీ, పోతిన నాయుడు, పిళ్లా రాము, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం : లోకేశ్ జన్మదినోత్సవాన్ని 98వ వార్డు టీడీపీ అధ్యక్షుడు పంచదార్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సింహాచలం ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ పీవి నరసింహ ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రౌతు రాంబాబు, రాజనాల సత్యారావు, గుసిడి అవినాశ్ బాబు, జి.వెంకటరెడ్డి, బంతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విశాలాక్షినగర్ : జీవీఎంసీ 9వ వార్డు రామాలయం ప్రాంతంలో స్థానిక టీడీపీ నాయకుడు వెంపాడ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు అక్కరబోయిన రాంబాబు, గరికిన నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

సాగర్‌నగర్ : జీవీఎంసీ 8వ వార్డు సాగర్ నగర్ అల్లూరి సీతారామరాజు కూడలిలో టీడీపీ నాయకులు మంత్రి లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ లొడగల అప్పారావు, వార్డు టీడీపీ అధ్యక్షుడు చెట్టుపల్లి గోపి, బి. దొరబాబు, ఎ. రాంబాబు, ఎస్. మంగాదేవి, బొడ్డు శ్రీనివాసరావు, బాబూరావు, తదితరులు పాల్గొన్నారు.

'దేశం'లో లుకలుకలు!

... 5వ పేజీ తరువాయి

రాజబాబు, వీఎంఆర్‌డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని నిర్మల, అన్ని అనుబంధ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు నలుగురూ హాజరుకాలేదు. పార్టీ కార్యాలయంలో జరిగే ప్రతి కార్యక్రమం గురించి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు, అనుబంధ సంఘాల నేతలకు కార్యాలయ వర్గాలు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తాయి. లోకేశ్ జన్మదిన వేడుకల నిర్వహణకు సంబంధించిన సమాచారం కూడా అలాగే ఇచ్చాయి. కానీ ఎమ్మెల్యేలు రాలేదు. ఇదిలావుండగా వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.ప్రణవ్‌గోపాల్ సొంతంగా వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన లోకేశ్ జన్మదిన వేడుకలకు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ శ్రీభరత్ (రెండుచోట్ల పాల్గొన్నారు) ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, జనసేన ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, బీజేపీ నాయకులు హాజరయ్యారు. అయితే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడంపై పార్టీలో చర్చ జరిగింది. నగరంలో కొద్ది రోజులుగా తెలుగుదేశం ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. ఈ మేరకు అధిష్ఠానం వద్ద కూడా సమాచారం ఉందని చెబుతున్నారు.

బడాబాబులకు సహకారం

... 5వ పేజీ తరువాయి

అవుట్‌లెట్లను రిలయన్స్ గ్రూపు టేకోవర్ చేసింది. అందులో విశాఖపట్నం కూడా ఉంది. సూపర్‌బజార్ ముందున్న సెంట్రల్ మాల్‌ను పూర్తిగా ఆధునికీకరించి, రీమోడల్ చేసి 'సెంట్రో' పేరుతో విశాఖ ప్రజల ముందుకువచ్చింది. ఇదంతా సూపర్ బజార్ అధికారుల కళ్ల ముందే జరిగింది. తమ స్థలాన్ని తాకట్టు పెట్టి రూ.వందల కోట్లు డబ్బులు తినేయడమే కాకుండా భవనాన్ని వేరొకరికి సబ్ లీజుకు ఇచ్చేస్తున్నా సహకార శాఖాధికారులు నోరెత్తలేదు. ఏమీ తెలియనట్టుగా కళ్లు మూసుకున్నారు. పైగా ఆడిట్‌లో బ్యాంక్ నోటీసు చూశాకే విషయం తెలిసిందని బుకాయిస్తున్నారు.వీరి నంగనాచి కబుర్లను జిల్లా ఉన్నతాధికారులూ నమ్మడం విశేషం. ఈ కేసులో ప్రజాప్రతినిధులు కూడా దీనిపై స్పందించకపోవడం గమనార్హం.

అద్దె ఎంత కట్టింది?

స్థలాన్ని లీజుకు తీసుకున్న సుహానీ సంస్థ (ఫ్యూచర్ గ్రూపు) కరోనా తరువాత విశాఖ సెంట్రల్ షాపింగ్ మాల్ కొన్నేళ్లు మూసేసింది. మొదట్లో (2008) నెలకు రూ.12 లక్షలు అద్దెగా నిర్ణయించారు. ఇది 33 ఏళ్ల లీజు ఒప్పందం కాబట్టి ఏడాదికేడాది అద్దె పెరుగుతుంది. దివాలా తీసిన సంస్థ సుమారుగా రెండేళ్లు మూతపడిన కాలానికి అద్దె ఎలా కట్టింది?, ఎంత కట్టింది? అనేది మాత్రం చెప్పడం లేదు. ఎవరికీ రూపాయి చెల్లించని సంస్థ వీరికి అద్దె ఎలా కట్టిందో జిల్లా అధికారులే చెప్పాలి.

టూరిజం మోడల్ సిటీగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

ప్రతిపాదనలు పంపాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులు వస్తే ఎక్కువ రోజులు నగరంలో ఉండేలా పర్యాటక అభివృద్ధి జరగాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో అందుబాటులో ఉండేలా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. భద్రతా ప్రమాణాలు కూడా చాలా ముఖ్యమన్నారు.

పీపీపీ విధానంలో వీఎంఆర్‌డీఏ ప్రాజెక్టులు

ఈ సమావేశంలో పాల్గొన్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టులను వివరించారు. కైలాసగిరిపై నేచర్ కాటేజీలు, బీచ్ వ్యూ కేఫ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫైవ్ స్టార్ వసతులతో కన్వెన్షన్ సెంటర్, రుషికొండలో హేబిటేషన్ సెంటర్, మధురవాడలో అర్బన్ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్, మెడికల్ టూరిజంలో భాగంగా అనకాపల్లిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తున్నామన్నారు. ఎమ్యూజ్‌మెంట్ పార్క్ ఏర్పాటుకు కూడా ప్రణాళికలు ఉన్నాయన్నారు. జీసీసీ ఎండీ కల్పనకుమారి మాట్లాడుతూ అరకు కాఫీగా ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకువచ్చామని, కాఫీ తోటల్లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. జూ పార్కులో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని క్యూరేటర్ మంగమ్మ చెప్పారు. సమావేశంలో పర్యాటక శాఖ అధికారులు శ్రీనివాస్, జ్ఞానవేణి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడిట్‌లో వెలుగుచూసిన సూపర్ బజారు బాగోతం

విశాఖపట్నం : సూపర్ బజారు స్థలాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి లీజుదారులైన సుహానీ షాపింగ్ మాల్ యజమానాలు రూ.350 కోట్ల రుణం తీసుకున్నట్టు 2022-23 ఆడిట్ నివేదికలో వెల్లడైందని సూపర్ బజారు ఎండీ శ్రీనివాసరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో ఇంకా రూ.129 కోట్లు బకాయి ఉందని, దానిపై న్యూఢిల్లీలోని డెట్ రికవరీ ట్రైబ్యునల్‌లో ఆర్‌బీఎల్ బ్యాంకు దావా వేసిందని, అందులో తమను కూడా భాగస్వామిగా చేర్చిందని వివరించారు. ఆ కేసులో వాదనలు వినిపిస్తున్నామని, మరో వైపు 51 విచారణ జరుగుతోందని, దానిపై నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగి. బుధవారం రాత్రి పది గంటల సమయంలో విశాఖపట్నంలో బయలుదేరిన కావేరి ట్రావెల్స్ బస్సు అర్ధరాత్రి 12:30 గంటల సమయం దాటేసరికి తూర్పుగోదావరి జిల్లా దివాన్ చెరువు జీరో పాయింట్ నుంచి గామన్ బ్రిడ్జి రోడ్డులోకి మళ్లింది. కొంతమూరు దాటి కాతేరు గ్రామ పరిధిలోకి వెళ్లేసరికి ఎదురుగా ఒక స్కూటీ రావడంతో దాన్ని తప్పించే క్రమంలో బస్సు డివైడర్‌పైకి ఎక్కి బోల్తా కొట్టి 200 మీటర్లు దూసుకుపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే లోపల నుంచి ఆర్తనాదాలు వినిపించడంతో స్థానికులు స్పందించి సెల్‌ఫోన్ల లైట్ల వెలుగులో బస్సు వెనుక అత్యవసర ద్వారాన్ని పగులగొట్టి అందరినీ బయటకు తీశారు. సమాచారం అందిన వెంటనే తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. త్రీటౌన్ సీఐ అప్పారావు, పోలీసులు క్షతగాత్రులను 108 అంబులెన్సులో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కళ్యాణి (21) మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. డ్రైవర్ పరారయ్యాడు. అతను మద్యం సేవించి ఉన్నాడేమోనని పోలీసులు అనుమానిస్తున్నారు. రెండో డ్రైవర్ గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బస్సు బోల్తాపడిన సంఘటనలో చిన్నకుమార్తె దుర్మరణం పాలవడంతో పెద్దకుమార్తెను పట్టుకుని తల్లి కోన లక్ష్మి రోదిస్తున్న తీరు అక్కడున్నవారిని కలచివేసింది. కల్యాణి తండ్రి రాఘవదాసు విశాఖపట్నం రైల్వేలో ఉద్యోగం చేస్తున్నారు. మర్రిపాలెంలో నివాసం ఉంటున్నారు. రాఘవదాసుకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె కల్యాణి విశాఖపట్నంలోని విజ్ఞాన్ విద్యా సంస్థల్లో బీటెక్ ఫైనలియర్ చదువుతోంది. గురువారం హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉంది. తన బంధువైన దీక్షితతో కలసి కావేరీ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్ బయలుదేరింది. ప్రమాదంలో నెల్లిమర్లకు చెందిన సంతోష్, గాజువాకకు చెందిన కె. ఫాతిమాబేగం, తునికి చెందిన పి. రాజ్యలక్ష్మి, అన్నవరానికి చెందిన కె. దేవిలకు తీవ్ర గాయాలయ్యాయి.

పోలీసుల అదుపులో నకిలీ మహిళా ఐపీఎస్!

... 5వ పేజీ తరువాయి

ఇచ్చిన వారిని కూడా పోలీసులు విచారిస్తున్నట్టు సమాచారం. దీనిపై ఎంవీపీ పోలీస్‌స్టేషన్ అధికారులు గోప్యత పాటిస్తుండడంతో సీపీ శంఖబ్రతబాగ్చిని వివరణ కోరగా నకిలీ ఐపీఎస్‌తోపాటు ఆమె భర్తపై ఉద్యోగాలిప్పిస్తామని డబ్బులు వసూలుచేసినట్టు ఫిర్యాదు అందినమాట వాస్తవమేనన్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తివివరాలను వెల్లడిస్తామని సీపీ తెలిపారు.

విశాఖ-దుర్గ్ వందే భారత్ కోచ్‌లలో కోత

... 5వ పేజీ తరువాయి

ఎనిమిది కోచ్‌లతోనే విశాఖ-దుర్గ్ వందే భారత్ రైలు నడపాలని నిర్ణయించారు. దీనిని శుక్రవారం నుంచే అమలు చేస్తారు. ఇందులో ఏడు కోచ్‌లు చైర్ కార్ సౌకర్యంతో ఉంటాయి. ఒక్కో దాంట్లో 70 సీట్లు ఉంటాయి. ఒక కోచ్ మాత్రం ఎగ్జిక్యూటివ్ చైర్ సదుపాయాలతో ఉంటుంది. ఇందులో సీట్లు కేవలం 40 మాత్రమే ఉంటాయి. రిజర్వేషన్ వివరాలు పరిశీలిస్తే 24వ తేదీ నాటికి చైర్ కారు సీట్లు 307 ఖాళీ ఉన్నాయి. ఏడు కోచ్‌లకు మొత్తం సీట్లు 490 కాగా 183 బుక్ అయ్యాయి. ఎగ్జిక్యూటివ్ చైర్స్ చూస్తే 24వ తేదీకి 29 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అంటే 40లో కేవలం 11 మాత్రమే రిజర్వ్ అయ్యాయి. ఇలా ఆదరణ తక్కువగా ఉన్నందున సగానికి కోచ్‌లు తగ్గించామని, దీనిని కూడా కొన్నాళ్లు పరిశీలించి అవసరమైతే మరిన్ని కోచ్‌లు తగ్గించే అవకాశం ఉందని రైల్వే వర్గాలు తెలిపాయి.

ఖాళీగా ఉండే ఈ కోచ్‌లను డిమాండ్ ఉన్న మార్గంలో సెట్ చేస్తామని వివరించారు. పూర్తిగా విశాఖ-దుర్గ్ వందే భారత్ రైలు రద్దు చేయడం అంత వేగంగా కుదరదని ఓ అధికారి అభిప్రాయపడ్డారు.

కూటమి విజయంలో లోకేశ్ పాత్ర కీలకం

... 5వ పేజీ తరువాయి

గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పీవీజీఆర్ నాయుడు (గణబాబు), పంచకర్ల రమేష్‌బాబు, సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్‌లతో కలిసి భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జన్మదిన వేడుకలకు కూడా దూరంగాఉండి రాష్ట్రాభివృద్ధి కోసం, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం కోసం దావోస్ పర్యటనలో లోకేష్ బిజీగా ఉన్నారన్నారు. యువగళం పాదయాత్రతో లోకేశ్ సరికొత్త అధ్యాయం సృష్టించారని కొనియాడారు. వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ ఎటువంటి బ్యాక్ గ్రౌండ్ లేని తనలాంటి సాధారణ వ్యక్తికి గొప్ప అవకాశమిచ్చిన ఘనత లోకేష్‌కు దక్కుతుందన్నారు. ఆయన జన్మదిన వేడుకల్లో భాగంగా రక్త దానం పెద్ద ఎత్తున నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఉత్తర ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలదీపిక, కూటమి నేతలు పాల్గొన్నారు.


స్థానికులతో మాట్లాడుతున్న జడ్పీ ఫణిరామ్

5వ వార్డులో అధికారుల పర్యటన

కొమ్మాది, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 5వ వార్డు అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్నామని కార్పొరేటర్ మొల్లి హేమలత అన్నారు. గురువారం ఆమె జడ్పీ ఫణిరామ్‌తో కలిసి వార్డులోని కొండవాలు ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అయ్యప్పనగర్, వివేకానంద నగర్, ముత్యాలమ్మ కాలనీ, గాంధీనగర్, శివశక్తినగర్ ప్రజలు జడ్పీకి పలు సమస్యలను విన్నవించారు. సర్వే నంబర్ 27 కొండవాలు ప్రాంతాల్లో ఇంటి పన్ను లేక ఇంటింటికి కుళాయిలు మంజూరు చేయడం లేదని, ఇంటి పన్ను వేయాలని స్థానికులు కోరారు. అలాగే వార్డులోని శ్మశాన వాటికలను, బొట్టవానిపాలెం చెరువును అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం జడ్పీ మాట్లాడుతూ అభివృద్ధి పనులకు నివేదికలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌ఓ కిశోర్, ఆర్‌ఐ ప్రదీప్, ఏఈ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాకర శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల సంరక్షణ పట్ల అప్రమత్తం

ఆనందపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : రైతులు పశువుల సంరక్షణ పట్ల అప్రమత్తంగా ఉండాలని పశు వైద్య శిబిరాల ప్రత్యేక అధికారి, పశు సంవర్ధక శాఖ ఇన్‌చార్జి అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ చిన్నయ్య అన్నారు. గురువారం ఆయన ముచ్చర్ల, బీపీవీ కళ్లాలు, శొంఠ్యాం పంచాయతీల్లో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఉచిత వైద్య శిబిరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పశుసంవర్ధక శాఖ అందిస్తున్న పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా పశువుల ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రోగాలను ముందుగా గుర్తించినట్లయితే నష్టం జరగకుండా జాగ్రత్త పడవచ్చునని చెప్పారు. అలాగే వ్యాధి నిరోధక టీకాలు క్రమం తప్పకుండా వేయించడం వల్ల సీజనల్ రోగాలు దరి చేరవన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో గోకులం షెడ్డులను సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ డీడీ ఎం. చంద్రశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ సజ్జ శ్రీనివాస్, మండల వైద్యాధికారి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు

సింహాచలం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామిని గురువారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకున్న వారిలో సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి పి. వెంకటరెడ్డి, చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్, రాష్ట్ర దేవదాయ శాఖ ట్రిబ్యునల్ సభ్యురాలు పద్మ ఉన్నారు. వారికి ఏఈఓ ఆనంద కుమార్, పర్యవేక్షణాధికారి ప్రసాద్ ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్న ప్రముఖుల గోత్రనామాలతో అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. గోదాదేవి అమ్మవారి దర్శనం అనంతరం పండితులు వేదాశీర్వచనాలీయగా అధికారులు శాలువతో సత్కరించి స్వామివారి ప్రసాదాలను అందజేశారు.

అప్పన్నకు స్వర్ణ పుష్పార్చన

సింహాచలం, జనవరి 23 (ఆంధ్యజ్యోతి) : వరాహలక్ష్మీ నృసింహస్వామికి ఆర్జిత సేవల్లో భాగంగా గురువారం స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రభాతారాధనలు పూర్తిచేశారు. ఉత్సవమూర్తి గోవిందరాజ స్వామిని ఉభయ దేవేరులతో స్వర్ణాభరణాలు, పుష్పమాలికలతో అలంకరించి ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేశారు. భక్తుల గోత్రనామాలతో సంకల్పించి విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు.అనంతరం నారసింహ అష్టోత్తర శతనామావళి పఠిస్తూ ప్రతి నామానికి ఒకటి చొప్పున పసిడి కుసుమాలతో పూజ చేశారు.స్వామివారికి మంత్రపుష్పం, కర్పూర నీరాజనాలిచ్చిన తరువాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు. అనంతరం అదే వేదికపై ఆర్జిత నిత్య కల్యాణం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.


స్వామివారికి పూజ చేస్తున్న అర్చకుడు

పాండ్రంగిలో మాజీ మంత్రి అప్పలనరసింహరాజు జన్మదిన వేడుకలు

పద్మనాభం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పాండ్రంగి గ్రామంలో మాజీ మంత్రి ఆర్‌ఎస్‌డీపీ అప్పలనరసింహరాజు 80వ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. నియోజకవర్గంలోని పలువురు నాయకులు ఆయన ఇంటికి వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన వారితో గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె. రామరాజు, మహంతి శ్రీను, బి. శ్రీను పీవీవీ ప్రసాదరావు పట్నాయక్, సుధాకర్‌వర్మ తదితరులు పాల్గొన్నారు. అలాగే భీమిలికి చెందిన గంటా నూకరాజు, కెఎస్‌ఎం సుధాకర్, కెఎస్‌ఆర్ కృష్ణారావు, పెద్ద శామ్యూల్, తదితరులు కూడా పాండ్రంగి వచ్చి అప్పలనరసింహరాజు శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

పద్మనాభం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి గురువారం ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో గాయత్రి కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల ఛారిటబుల్ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో పలువురు చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ విస్తరణాధికారి మీనాకుమారి, రూపాకుల రవికుమార్, నాగమణి, శ్రీనివాసరావు, వెంకటరావు, అప్పారావు పాల్గొన్నారు. అలాగే కృష్ణాపురంలో బీజేపీ యువమోర్చా మండల అధ్యక్షుడు హంస మహేశ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

భీమునిపట్నం : పట్టణంలో ఆదర్శ హిందీ ప్రేమి మండలి ఆధ్వర్యంలో నేతాజీ జయంతి ఘనంగా నిర్వహిం చారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో వున్న నేతాజీ విగ్రహానికి ఆ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు కృష్ణారావు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన సుభాష్ చంద్రబోసు దేశానికి అందించిన సేవలను, జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మధురవాడ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్టు జోన్-3 డీఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మధురవాడ, రేవళ్లపాలెం, చంద్రంపాలెం, ఎన్‌జీఓ కాలనీ, వుడా కాలనీ, భగవాన్‌దాస్ కాలనీ, ఎంఎస్ఆర్ లేఅవుట్, సాయిప్రియా లేఅవుట్, భాస్కర్‌నగర్, సంపత్‌నగర్, ఉజ్వల ఆస్పత్రి ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

కొమ్మాది : కొమ్మాదిలో 11కేవీ సేవానగర్ ఫీడర్ మరమ్మతుల దృష్ట్యా కొమ్మాది జంక్షన్, శ్రీనివాసానగర్, సాయి రామ్ కాలనీ, జీసీసీ లేఅవుట్, టీచర్స్ లేఅవుట్, అమరావతి కాలనీ, సూర్యా పేపర్, డ్రైవర్స్ కాలనీ, సాయిరాం కాలనీ, వెంకట్ నగర్, ఎస్సీ కాలనీ, మాస్టర్ స్కూల్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 సరఫరా ఉండదని ఏఈ నరేశ్ తెలిపారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

గ్లాస్ గుర్తు రిజర్వుపై హర్షం

పద్మనాభం రూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ఎన్నికల సంఘం జనసేన పార్టీకి గాజు గ్లాసును శాశ్వత గుర్తుగా కేటాయించడంతో ఆ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం వారు అయినాడ. ఏనుగులపాలెం, పాండ్రంగి గ్రామాల్లో గాజు గ్లాసును చూపిస్తూ ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు కె. రామస్వామినాయుడు, వినోద్ పాల్గొన్నారు.

గీతం విద్యార్థుల ఫ్లాష్‌మాబ్



సాగర్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : గీతం వర్సిటీ బిజినెస్ స్కూల్‌లో ఈనెల 29, 30, 31వ తేదీల్లో జరిగే గీతం ఎక్స్‌లెన్స్ మీట్ (జెమ్) 2025 యువజనోత్సవానికి సన్నాహంగా యూనివర్సిటీ ఆవరణలో విద్యార్థులు గురువారం ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ నృత్యాలు చేశారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

కొమ్మాది, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు గొంప వెంకటేశ్వర్లు గురువారం పదవీవిరమణ చేయడంతో సహచర ఉపాధ్యాయులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం గొట్టేటి రవి, సోమయాజులు, బీటీఏ జిల్లా యానియన్ అధ్యక్షుడు ప్రకాశ్‌బాబు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు స్వామి, టీఎన్‌యూఎస్ జిల్లా అధ్యక్షుడు శ్రీను, రత్నరాజు, సునీత తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

... 5వ పేజీ తరువాయి

జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ కింద ఆమోదం పొందిన పనులకు సంబంధించిన బిల్లులు మాత్రమే పీఎఫ్‌ఎంఎస్ నుంచి మంజూరవుతాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృత్తిపన్ను కింద రూ.8.82 లక్షలు, తలసరి గ్రాంటు కింద రూ.2.95 లక్షలు, సర్పంచ్‌ల గౌరవ వేతనం కోసం రూ.50.87 లక్షలు, సీనరేజ్ కింద రూ.1.82 కోట్లు విడుదలయ్యాయన్నారు.

శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

ఆనందపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షల్లో శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా ఉపాధ్యాయుల బోధన చేయాలని జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ జె. చంద్రశేఖరరావు అన్నారు. గురువారం ఆయన స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి అభ్యసనా సామర్థ్యాన్ని పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ సి,డి గ్రేడ్ విద్యార్థుల ఉత్తీర్ణతకు సబ్జెక్టుల వారీగా యాక్షన్ ప్లాన్ తయారు చేసి, అందుకు అనుగుణంగా బోధన చేయాలని సూచించారు. ఆరో తరగతి నుండే విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తే పదో తరగతికి వచ్చేసరికి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆయనతో పాటు పాఠశాల హెచ్‌ఎం ఆర్‌కే పట్నాయక్ ఉన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి చంద్రశేఖరరావు


ధర్నాలో మాట్లాడుతున్న కృష్ణారావు

'ఉక్కు ఉద్యోగులపై యాజమాన్యం వైఖరి మారాలి'

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉక్కు కర్మాగారం ఉద్యోగులపై యాజమాన్యం వైఖరి మారాలని సీఐటీయూ ప్లాంట్ మాజీ అధ్యక్షుడు ఎం.కృష్ణారావు అన్నారు. ఉద్యోగులకు సకాలంలో జీతాలు చెల్లించాలని, పదవీ విరమణ చేసిన ఉద్యోగులపై మెడికల్ భారం మోపడాన్ని నిరసిస్తూ గురువారం ప్లాంట్ పరిపాలన భవనం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవీ విరమణ చేసిన ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేయాలనే లక్ష్యంతోనే మెడికల్ ఇన్సూరెన్స్‌ను భారీగా పెంచేందుకు యాజమాన్యం సిద్ధపడడం భావ్యం కాదన్నారు. యూనియన్ అధ్యక్షుడు వైటీ దాసు మాట్లాడుతూ ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు. ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి మాట్లాడుతూ ప్లాంట్ యాజమాన్యం ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటుండడం మంచి పద్ధతి కాదన్నారు. నాయకులు ఎన్.రామారావు, వి.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటక్ ఆధ్వర్యంలో నేడు ధర్నా

స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు వేతనాల చెల్లించడంలో యాజమాన్య నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ శుక్రవారం ప్లాంట్ ఈడీ (వర్క్స్) కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నట్టు ఇంటక్ ప్లాంట్ అధ్యక్షుడు పీవీ రమణమూర్తి తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు పాల్గొనవలసిందిగా కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గోపాలపట్నం, జనవరి 23(ఆంధ్రజ్యోతి): గోపాలపట్నం సబ్ స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా సుసర్ల కాలనీ, రెడ్డి వీధి, బాజీ జంక్షన్, విద్యానగర్, నాయుడు క్వార్టర్స్, రవీంద్రనగర్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఆకట్టుకున్న ఆధ్యాత్మిక ప్రవచనాలు

వేపగుంట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భరత్‌నగర్ సమీపంలోని లక్ష్మీనరసింహనగర్ కాలనీలో ఉన్న గోపీజనవల్లభస్వామి ఆలయంలో టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ సంయుక్తంగా మూడు రోజులుగా ఆధ్యాత్మి ప్రవచనాలు కొనసాగుతున్నాయి. గురువారం సాయంత్రం ప్రసంగకర్త బ్రహ్మశ్రీ కలగ మురళీకృష్ణశర్మ ప్రసంగాలు అందరినీ ఆకట్టుకున్నాయి. గజేంద్ర మోక్షం, రుక్మిణీ కల్యాణ వైభవాన్ని కళ్లకు కట్టినట్టుగా భక్తులకు వివరించారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం:** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-12 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 14, వంకాయలు (తెలుపు) 28, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 46, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 44, బీరకాయలు 52, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజీ 15, క్యారెట్ 36, దొండకాయలు 36, బంగాళదుంపలు 26, అరటికాయ (పెద్దది)7, అల్లం (పాతది) 48, మునక్కాడలు (కిలో) 110, బరబాటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోసకాయలు 32, వెల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 42, పొటల్స్ 80, కీరదోస 34, క్యాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 50, చిలగడదుంపలు 40, కంద 56, దేముడుచిక్కుడు 40, గోరుచిక్కుడు 30, ఆగాకార దేశవాళి 100, ఆగాకర హైబ్రిడ్ 50, కూరపెండలం 26, బ్రకోలి 80, నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర(కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, మామిడి అల్లం 64, బొప్పాయి 35, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)
(వంద - రూ.లలో)

విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు
బ్యాగ్

రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270


మహిళా కబడ్డీ పోటీల విజేతలతో శ్రీభరత్, గణబాబు, గండి బాబ్జీ, తదితరులు


కేక్ కట్ చేశాక మహిళలకు చీరలు పంపిణీ చేసిన నల్లూరు సూర్యనారాయణ

ఘనంగా నారా లోకేశ్ జన్మదిన వేడుకలు


ప్రసాదుల శ్రీనివాస్‌కు కేక్ తినిపిస్తున్న నాయకులు


చినముషిడివాడలో కేక్ కట్ చేస్తున్న సేనాపతి వసంత

గాజువాక, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను గురువారం పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఇక్కడి పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రగతి కోసం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లతో పాటు నారా లోకేశ్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బొండా జగన్, పల్లా శ్రీనివాసరావు, గంధం శ్రీనివాసరావు, రౌతు శ్రీనివాసరావు, బొడ్డు నరసింహపాత్రుడు, నాయకులు విల్లా రామ్మోహన్‌కుమార్, పోతిన వెంకటరావు, వెంకటరమణ, నమ్మి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు. అలాగే వంటిళ్ల జంక్షన్ వద్ద జరిగిన కార్యక్రమంలో తెలుగు యువత గాజువాక అధ్యక్షుడు బలగ బాలు నాయుడు కేక్ కట్ చేశారు.

గోపాలపట్నం: మంత్రి నారా లోకేశ్ పుట్టినరోజు వేడుకలను పశ్చిమ ఎమ్మెల్యే పి.గణబాబు ఆధ్వర్యంలో గోపాలపట్నంలో టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ శ్రీభరత్ కేక్‌కట్ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహిళా కబడ్డీ పోటీల విజేతలకు ఎంపీ బహుమతులను అందజేశారు. అనంతరం ఆయా వార్డుల్లో అత్యధికంగా టీడీపీ సభ్యత్వం చేసిన బూత్ ఇన్‌చార్జిలు, నాయకులను శ్రీభరత్ సత్కరించారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, పలువురు కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మల్కాపురం: పశ్చిమ నియోజకవర్గం ఏడు వార్డుల టీడీపీ కార్యాలయం, కోరమాండల్ గేటు అన్న క్యాంటీన్ వద్ద నిర్వహించిన నారా లోకేశ్ జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే గణబాబు తనయుడు మౌర్యసింహ పాల్గొని కేక్ కట్ చేశారు. టీడీపీ 58వ వార్డు అధ్యక్షుడు కోరాడ శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు. అలాగే రామకృష్ణాపురంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు నక్కా లక్ష్మణరావు, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సీహెచ్ రామ్మోహన్‌నాయుడులు కేక్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఇందిరా కాలనీలో పార్టీ 60వ వార్డు అధ్యక్షుడు మాతా శ్రీను, ఏడు వార్డుల టీడీపీ కార్యాలయంలో 58వ వార్డు ప్రధాన కార్యదర్శి ఎం.శంకర్‌లు కేక్ కట్ చేశారు.

పెందుర్తి: టీడీపీ సీనియర్ నాయకుడు సేనాపతి శంకరరావు ఆధ్వర్యంలో చినముషిడివాడలోని టీడీపీ 97వ వార్డు కార్యాలయంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ సేనాపతి వసంత కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు.

అగనంపూడి: పెదమడక సంపత్ వినాయక ఆలయంలో నారా లోకేశ్ పేరిట టీడీపీ నాయకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పాదయాత్రకు చిహ్నమైన పైలాన్ వద్ద కేక్ కట్ చేశారు. పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు దోశేంద్ర, ఇల్లపు ప్రసాద్, కె.సత్యారావు, చందురమేశ్, డి.రమేశ్, విందుల రాజు కె.తిలక్, తదితరులు పాల్గొన్నారు. అలాగే టీడీపీ 79వ వార్డు మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లి కనకభవానీ ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు.

పెదగంట్యాడ: టీడీపీ 76వ వార్డు కార్యాలయంలో నిర్వహించిన మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు కేక్ చేసి కార్యకర్తలు, అభిమానులకు పంచిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ యువతకు విద్య, ఉపాధి అంశాల్లో లోకేశ్ భరోసాగా నిలుస్తున్నారన్నారు. నాయకులు బాసెట్టి అప్పారావు, సుదర్శనరావు, కూన వెంకటరావు, పి.రమణ, వి.వెంకన్న, పి.ఉగ్రం, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పెదగంట్యాడలోని టీడీపీ కార్యాలయంలో 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి కేక్ కట్ చేశారు. నాయకులు పులి వెంకట రమణారెడ్డి, ఎం.పెంటయ్య, కిలాని ముసలయ్య, నంబారు సింహాద్రి, డి.పెరుమాళ్లు, యు.వెంకటరావు, ఎం.అక్తర్, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: మంత్రి లోకేశ్ పుట్టినరోజు సందర్భంగా టీడీపీ 68వ వార్డు నాయకులు అక్కిరెడ్డిపాలెం హైస్కూల్‌లో విద్యార్థులకు పెన్నులు, ఇతర పాఠ్య సామాగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు సర్వసిద్ధి అనంతలక్ష్మి, నాయకులు లెంక మురళి, డి.అప్పలరాజు, తమ్మిరాజు, గీత, అప్పలరాజు, సత్యవతి, తదితరులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: నారా లోకేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని 86వ వార్డు పరిధి మాతృశ్రీ నగర్‌లో టీడీపీ ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ కేక్ కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు స్వీట్లతో పాటు పంచిపెట్టారు. పలువురు పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. రాష్ట్రాభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న శ్రామికుడు లోకేశ్ అని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, నాగార్జున, త్రినాథ్, అప్పారావు, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు. అలాగే 87వ వార్డు వడ్లపూడిలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొండా జగన్ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేశారు. తొలుత ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లోకేశ్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నాయకులు ఎస్ఎస్ విజయ రామరాజు, ఎం.రాము, రాజన్ రాజు, రాంబాబు, డీవీ అప్పారావు, పి.దానయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: గ్రేటర్ 90వ వార్డు పరిధి బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీలోని కార్పొరేటర్ క్యాంప్ కార్యాలయంలో నారా లోకేశ్ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని బొమ్మిడి రమణ కేక్ కట్ చేశారు. రాష్ట్రంలో టీడీపీ సభ్యత్వాలు కోటికి చేరుకునేలా పార్టీ శ్రేణులకు లోకేశ్ దిశానిర్దేశం చేశారన్నారు. కూటమి నాయకులు ఏఎస్ఆర్ శ్రీనివాస్, శ్రీను పట్నాయక్, జ్యోతి, వెంకటలక్ష్మి, మణి, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

జీర్ణావస్థలో ప్రధాన డ్రైనేజీలు

- ఎక్కడికక్కడ తిష్ట వేస్తున్న మురుగు
- ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు దిగువకు పారే అవకాశం లేక ఒక్కోసారి రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు
- తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్న పాదచారులు, వాహనదారులు


జగ్గు జంక్షన్ రోడ్డులో శిథిలమైన డ్రైనేజీ

గాజువాక, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ గాజువాక జోనల్ పరిధిలో ప్రధాన రహదారులకు ఇరుపక్కలా గల డ్రైనేజీలు చాలాచోట్ల శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే మురుగు నీరు దిగువకు పారేందుకు అవకాశం లేక రహదారులపైకి చేరుతుంది. దీంతో ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే ఆయా పరిసర ప్రాంతాలు దుర్గంధంతో నిండిపోతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికప్పుడు డ్రైనేజీలు నిండిపోయి రహదారులపై నీరు పారడం నిత్యకృత్యంగా మారుతున్నా పట్టించుకునే నాథులే కరువయ్యారని ప్రజలు వాపోతున్నారు.

ప్రధానంగా జగ్గు జంక్షన్ నుంచి కొత్త గాజువాక వరకు గల ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీలు పలుచోట్ల పూర్తి స్థాయిలో శిథిలమయ్యాయి. దీంతో డ్రైనేజీల్లో రోజుల తరబడి మురుగు తిష్ట వేస్తుంది. ఒక్కోసారి ఎగువ ప్రాంతాల నుంచి పెద్దమొత్తంలో నీరు వస్తే దిగువకు వెళ్లే అవకాశం లేక మురుగంతా రోడ్డుపైకి చేరుకుంటుంది. దీంతో ఆయా రోడ్లు ఛిద్రంగా మారడంతో పాటు తీవ్ర దుర్వాసన వల్ల ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే ప్రజలు ముక్కు మూసుకుని ముందుకు సాగాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. అదేవిధంగా చైతన్య నగర్ రోడ్డు, గాజువాక ప్రధాన రహదారుల్లోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంది. ఈ క్రమంలో ప్రతి సోమవారం జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి అధికంగా ఫిర్యాదులు అందుతున్నాయి. వీటిపై స్పందించిన అధికారులు ఏఏ ప్రాంతాల్లో డ్రైనేజీల పరిస్థితి ఎలా ఉందో పరిశీలించారు. ఇప్పటికే కణితి రోడ్డులో కొంతమేర డ్రైనేజీలకు మరమ్మతులు చేపట్టారు. ఇతర డ్రైనేజీలను నిర్మించేందుకు జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. జోన్ పరిధిలో సాధ్యమైనంత త్వరగా డ్రైనేజీల నిర్మాణ పనులు పూర్తి చేస్తామని అధికారులు పేర్కొన్నారు.


రహదారికి ఆనుకుని ఉన్న కొండను తవ్వేస్తున్న దృశ్యం


ట్రాక్టర్‌లో గ్రావెల్, మట్టిని లోడ్ చేస్తున్న సిబ్బంది

కొత్త నక్కవానిపాలెంలో కొండను తవ్వేస్తున్నారు!

- గ్రావెల్‌ను తరలించేస్తున్నారు
- అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు

మల్కాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జీవీఎంసీ 59వ వార్డు పరిధి కొత్త నక్కవానిపాలెం క కొత్త సర్వే నంబర్-55లో ఉన్న కొండను ఇష్టారాజ్యంగా తవ్వేస్తూ గ్రావెల్‌ను తరలిస్తున్నారు. ఇప్పటివరకు సుమారు ఐదు వందల గజాలకు పైగానే కొండను తవ్వేసినట్టు సమాచారం. కొండను చదును చేశాక ఆ స్థలంలో భవనం నిర్మించేందుకు గాను ఓ కాంట్రాక్టరుతో సదరు కబ్జాదారుడు ఒప్పందం కుదుర్చుకున్నట్టు తెలిసింది. ఇప్పుడు ఆ కాంట్రాక్టరు కూడా కొండను తవ్వేస్తున్నాడని స్థానికులు పేర్కొంటున్నారు. ఈ కొండ పారిశ్రామిక ప్రాంతం ప్రధాన రహదారికి కేవలం రెండు వందల అడుగుల దూరంలో మాత్రమే ఉండడంతో ఈ స్థలం విలువ రూ.లక్షల్లో ఉంటుంది. కొండను తవ్వేస్తూ రాయిని, మట్టిని ట్రాక్టర్లలో లోడ్ చేసి ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తూ అడ్డగోలుగా సంపాదిస్తున్నాడన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇలా రోజుకు సుమారు పది టాక్టర్లతో గ్రావెల్‌ను తరలిస్తున్నట్టు తెలుస్తోంది. ఇక్కడ కొంతమంది మహిళలను పనిలో పెట్టి మట్టిని ట్రాక్టర్లలో లోడ్ చేయిస్తున్నారు. యంత్రాల సాయంతో కొండను తవ్వేస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొండ తవ్వకాల వెనక ఓ వైసీపీ నాయకుడి హస్తం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ములగాడ తహసీల్దార్ స్పందించి తగిన చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.


కార్మిక నాయకుడిపై పోలీసులకు ఫిర్యాదు

మల్కాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్‌లో విస్తరణ పనులు చేపడుతున్న ఎల్‌అండ్‌టీ సంస్థ ముఖ్య అధికారి విశాఖ ఇండస్ట్రియల్ ఏరియా కాంట్రాక్ట్ వర్కర్స్ అండ్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దేవ అప్పలరాజుపై మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పలరాజు తనను అకారణంగా తోసేశాడని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు పోలీసులు అప్పలరాజుతో పాటు సదరు అధికారిని స్టేషన్‌కు పిలిపించి విచారించారు. దాడులు చేయడం చట్టప్రకారం నేరమని, మళ్లీ ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటే కేసు పెడతామని అప్పలరాజును హెచ్చరించి పంపేశారు.

'బెహరా'లో రక్తదాన శిబిరం

గోపాలపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నరవ గ్రామంలోని బెహరా పాలిటెక్నిక్ కళాశాలలో ఏఎస్ రాజా బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన కళాశాల కార్యదర్శి డాక్టర్ బెహరా విజయచైతన్య మాట్లాడుతూ రక్తదానం చేయడాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని కోరారు. అనంతరం సుమారు 150 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కళాశాల ఏడీ బి.తరుణ్, బ్లడ్ బ్యాంక్ మెడికల్ అధికారి డాక్టర్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

సోలార్ విద్యుత్‌పై వినియోగదారులకు అవగాహన


'సూర్యఘర్' పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆటోనగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బిల్లులను తగ్గించుకునేందుకు అందరూ విధిగా ప్రధానమంత్రి సూర్యఘర్ యోజనలో పథకంలో చేరాలని, సోలార్ రూఫ్‌టాప్‌ను ఏర్పాటు చేసుకోవాలని 88వ వార్డు కార్పొరేటర్ మొల్లి ముత్యాలనాయుడు అన్నారు. దువ్వాడలో గురువారం ఈ పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. పేద, మధ్యతరగతి ప్రజలకు విద్యుత్ బిల్లులను తగ్గించడమే కాకుండా, ఇంధన రంగంలో భారత్ స్వావలంబన సాధించే దిశగా పయనించేందుకు కేంద్రం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. విద్యుత్‌శాఖ అనకాపల్లి ఎస్ఈ జి.ప్రసాద్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కేంద్రం వినియోగదారులకు సబ్సిడీ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఈఈలు ఎస్.రామకృష్ణ, సురేఖ, బి.సత్యన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన పల్లా శ్రీనివాసరావు

ఉక్కు నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తా

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

కూర్మన్నపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): ఉక్కు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు గాజువాకను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. 87వ వార్డులో రూ.రెండు కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వర్ణాంధ్ర వైపు పయనిస్తుందన్నారు. వార్డులో నెలకొన్న పలు సమస్యలను పల్లాకు కార్పొరేటర్ బొండా జగన్ వివరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు విజయరామరాజు, రాజన్ రాజు, డీవీ అప్పారావు, ఎం.రాము, పి.దానయ్య, కె.శ్రీనివాస నాయుడు, పి.కృష్ణ, రాంబాబు, కల్యాణచక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

86వ వార్డులో 'పల్లా' పర్యటన

గ్రేటర్ 86వ వార్డులో వుడా నగర్-1 పార్కును ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సందర్శించారు. పార్కులు అభివృద్ధికి నోచుకోవడం లేదని టీడీపీ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ పల్లాకు వివరించారు. వార్డులో రాజీవ్ నగర్, వుడా ఫేజ్-6, లక్కరాజుపాలెం, వుడా ఫేజ్-2, ఉప్పర కాలనీ, దువ్వాడ సెక్టర్-2లలో రూ.రెండు కోట్లతో వాకింగ్ ట్రాక్‌లు, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, సామాజిక భవనాల నిర్మాణ పనులు చేస్తున్నామన్నారు. వుడా నగర్ 1-6, మాతృశ్రీనగర్ కాలనీ ప్రతినిధులు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు అమిరెడ్డి మురళీధరరెడ్డి, దామా సుబ్బారావులు పలు సమస్యలను పల్లా దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో నాయకులు వేగుంట శ్రీనివాస్, కాదా శ్రీను, కనకరాజు, ఈశ్వరరావు, వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించాలని 'పల్లా'కు వినతి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు సీతానగరం సచివాలయం వెనక ఖాళీగా ఉన్న స్థలంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి గ్రామాభివృద్ధికి సహకరించాలంటూ గ్రామ పెద్దలు ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడం వల్ల స్థానిక యువకుల్లో కొందరికి ఉపాధి లభిస్తుందని, ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పల్లాను కలిసిన వారిలో గ్రామ కమిటీ ప్రతినిధులు ఎన్.దుర్గబాబు, పల్లా హరిబాబు, టీడీపీ నాయకుడు ఎన్.అప్పారావు, తదితరులు ఉన్నారు.

అమరావతి నిర్మాణానికి 'ఉక్కు'ను వినియోగించాలి

సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ


కూర్మన్నపాలెంలోని దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న జేడీ లక్ష్మీనారాయణ

కూర్మన్నపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): అమరావతి నిర్మాణానికి విశాఖ ఉక్కును వినియోగిస్తామని కూటమి ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 1,442వ రోజుకు చేరాయి. ఈ శిబిరాన్ని రాత్రి లక్ష్మీనారాయణ సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంటుకు సొంత గనులు కేటాయించాలనీ, సెయిల్‌లో విలీనం చేస్తేనే ప్రయోజనకరంగా ఉంటుందని, పూర్తి స్థాయిలో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచేందుకు నియామకాలు చేపట్టాలన్నారు. నియామకాల్లో ఆర్-కార్డుదారులకు, నిర్వాసితులకు న్యాయం చేయాలని, 15 ఈడీ పోస్టులకు గాను ఒకరు కూడా లేరని, 64 సీజీఎంలకు గాను ఆరుగురు మాత్రమే ఉన్నారని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తిని సీఎండీగా నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్, ఎన్.రామారావు, యు.రామస్వామి, వి.శ్రీనివాసరావు, ఎన్.రామచంద్రరావు, కేఎస్ఎన్ రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్యాకేజీతో సమస్య పరిష్కారం కాదు

ఉక్కుటౌన్‌షిప్: స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ప్రభుత్వం కేటాయించిన ప్యాకేజీతో సమస్య పరిష్కారం కాదని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ అన్నారు. సీఐటీయూ ప్లాంట్ కార్యాలయంలో యువ ఉద్యోగులతో ఆయన సమావేశమై మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రగతి సాధించాలంటే సొంత గనులు కేటాయించాలని, లేనిపక్షంలో సెయిల్‌లో విలీనం చేయాలన్నారు. ప్లాంటుకు మౌలిక సదుపాయాలు కల్పిస్తే అతి తక్కువ కాలంలోనే అభివృద్ధి చెందుతుందన్నారు. కార్మికులంతా ఉద్యమాలతో ప్లాంటును కాపాడుకోవాలని, ఉక్కు ఉద్యమంలో తాను పాల్గొంటానని పేర్కొన్నారు. సమావేశంలో సీఐటీయూ ప్లాంట్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్యరాం, నాయకులు వైటీ దాసు, యు.రామస్వామి, గంగాధర్, మరిడయ్య, పుల్లారావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నేతాజీ సుభాశ్ చంద్రబోస్‌కు నివాళి

అగనంపూడి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని గురువారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ఇక్కడి సత్రం జంక్షన్‌లో మహాత్మాగాంధీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుభాశ్ చంద్రబోస్ చిత్రపటానికి సంస్థ అధ్యక్షుడు చిత్తా రామారావు పూలమాల నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం ఎంతో కృషి చేసిన మహోన్నత వ్యక్తి సుభాశ్ చంద్రబోస్ అని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బల్ల పైడిరాజు, శేఖర్, అప్పారావు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మల్కాపురం: స్వాతంత్ర్య పోరాటంలో సుభాశ్ చంద్రబోస్ పాత్ర స్ఫూర్తిదాయకమని జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఈపీఎస్ భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేతాజీ దేశభక్తి నిరుపమానమైనదన్నారు. అనంతరం అనంతరం సుభాశ్ చంద్రబోస్‌పై క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సేవా పథకం సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై.అనసూయాదేవి, తెలుగు అధ్యాపకురాలు లక్ష్మీదేవి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్.ఎ.డి.జంక్షన్: జీవీఎంసీ 52వ వార్డు పరిధి శాంతినగర్‌లో డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో నేతాజీ సుభాశ్ చంద్రబోస్ చిత్రపటానికి జియ్యాని శ్రీధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. స్వాతంత్ర్య పోరాటంలో నేతాజీ పోరాట పటిమ అజరామరమనానరు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతు బజారులో క్లాత్ సంచుల పంపిణీ

గోపాలపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైతు బజారులో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు కొనుగోలుదారులకు క్లాత్ సంచులను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ వాడకాన్ని విడనాడాలని ప్రచారం చేయడంతో పాటు నార, క్లాత్ సంచుల వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేడీ ఫౌండేషన్ గోపాలపట్నం సభ్యులు, రైతు బజారు సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్యం నుంచి కాపాడాలని వినతి

అక్కిరెడ్డిపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): పోర్టు గొడౌన్స్ నుంచి వెలువడుతున్న కాలుష్యం నుంచి 68వ వార్డు పరిధిలోని పలు కాలనీల ప్రజలను కాపాడాలని విశాఖ పోర్టు చైర్మన్ డాక్టర్ మధైయాన్ అంగముత్తును కార్పొరేటర్ గుడివాడ అనూష కోరారు. గురువారం పోర్టు చైర్మన్‌ను కలిసిన ఆమె మింది, చుక్కవానిపాలెం, అక్కిరెడ్డిపాలెం పరిసర ప్రాంతాలను ఆనుకుని ఉన్న గొడౌన్ల ఏర్పడుతున్న కాలుష్య సమస్యను వివరించి వినతి పత్రం అందజేశారు. ఈ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని పోర్టు చైర్మన్ హామీ ఇచ్చినట్టు ఆమె తెలిపారు.

లోకేశ్ నాయకత్వంలో టీడీపీకి ఉజ్వల భవిష్యత్తు

పలు చోట్ల నిర్వహించిన జన్మదిన వేడుకల్లో వక్తలు

తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని గురువారం తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పలు చోట్ల నిర్వహించిన వేడుకల్లో టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో వక్తలు మాట్లాడుతూ లోకేశ్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ మరింత ప్రగతిదాయకంగా ముందుకు సాగుతుందన్నారు.



కేక్ కట్ చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, పాల్గొన్న నేతలు సుజాత తదితరులు

సీతమ్మధార, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఉత్తర నియోజకవర్గం టీడీపీ నాయకుడు వెల్లంకి భరత్ ఆధ్వర్యంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఏపీ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జి కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. బాబ్జీ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ పార్టీ గెలుపునకు చేసిన కృషి అమోఘమన్నారు. కొత్త తరానికి లోకేశ్ నాయకత్వం అవసరమన్నారు. కార్యక్రమంలో టీడీపీ స్థానిక నాయకులు, శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం : గ్రేటర్ విశాఖ 44వ వార్డులోని ముస్లిం తాటిచెట్లపాలెం పోర్టు ఆస్పత్రి జంక్షన్ వద్ద ఎంటీసీ పాలెం హైవే బాయ్స్ ఆధ్వర్యంలో పది కిలోల కేక్‌ను ఉత్తర నియోజకవర్గం టీడీపీ నాయకుడు వెల్లంకి భరత్ కట్ చేశారు. అనంతరం 200 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే 26వ వార్డులో టీడీపీ బీసీ సెల్ ఉపాధ్యక్షుడు కొయిలాడ వెంకటేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కార్పొరేటర్ ముక్కా శ్రావణి కేక్ కట్ చేశారు. మహిళలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. జీవీఎంసీ 27వ వార్డు పరిధి దొండపర్తిలో కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ చైర్మన్ గొలగాని వీరారావు బుజ్జి కేక్ కట్ చేసి నాయకులకు తినిపించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.శివప్రసాద్, నాయకులు పీవీ రమణారావు, కనకరావు, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దొండపర్తి : జీవీఎంసీ 42వ వార్డు టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ ఇన్‌చార్జ్ సీతంరాజు సుధాకర్ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంటరీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అకిరెడ్డి జగదీష్, వార్డు అధ్యక్షుడు కన్నం వెంకటరమణారావు, ప్రధాన కార్యదర్శి ముక్కి రామకృష్ణ, నాయకులు జనపాల శ్రీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కంచరపాలెం : జీవీఎంసీ 55వ వార్డులోని గంగన్ననగర్‌లో గల టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ ఈతలపాక సుజాత కేక్‌ను కట్ చేసి పంపిణీ చేశారు. పలువురు మహిళలకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈ.ఈశ్వరరావు, జి.వీరుబాబు తదితరులు పాల్గొన్నారు.

మాధవధార : జీవీఎంసీ 51వ వార్డులోని సీతన్న గార్డెన్స్‌లో గల టీడీపీ వార్డు కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు సనపల కీర్తి అధ్యక్షతన వేడుకలు నిర్వహించారు. కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నేతలు మూల అప్పారావు, జయరాజ్, తెలుగు మహిళా, యువజన నేతలు పాల్గొన్నారు.

కేవీలో భారత్ హై హమ్ సిరీస్ క్విజ్ పోటీ



మాట్లాడుతున్న కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్

అక్కయ్యపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : తాటిచెట్లపాలెంలోని పీఎం కేంద్రీయ విద్యాలయ వాల్తేరు ప్రాంగణంలో గురువారం భారత్ హైన హమ్ సిరీస్ క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఈశ్వరీప్రభాకర్ మాట్లాడుతూ భారతీయ వారసత్వం, సంస్కృతి, చరిత్రపై విద్యార్థులకు అవగాహన పెంపొందించడం, జాతీయభావం, ఐక్యత గురించి అవగాహన కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జిత్ మాట్లాడుతూ భారతీయ స్వాతంత్ర్య యోధులు, భౌగోళిక ప్రదేశాలు, సంప్రదాయ కళారూపాలు, చారిత్రక ఘటనలు తదితర విషయాలను వివరించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈస్ట్‌కోస్ రైల్వే సీనియర్ డీపీవో కబీర్ అన్సారీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అక్కయ్యపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నిర్వహణ పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ ఈఈ బి.సింహచలంనాయుడు తెలిపారు. అబిద్‌నగర్, అక్కయ్యపాలెం ప్రధాన రహదారి, వేణుగోపాల్ స్వామి ఆలయం, శాంతినగర్, కైలాసపురం ప్రధాన రహదారి, సంజీవయ్య కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

నేతాజీకి నివాళి

కంచరపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ నేటి యువతకు ఆదర్శమని శ్రీఛత్రపతి శివాజీ మహరాజ్ యూత్ ప్రతినిధులు కొనియాడారు.నేతాజీ జయంతి సందర్భంగా గురువారం కంచరపాలెం మెట్టు వద్ద సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించడానికి నేతాజీ అనుసరించి మార్గం యువతకు స్ఫూర్తిదాయకమన్నారు.

ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు దాడి రమేష్, బీశెట్టి నారాయణరావు, నరసింగరావు, మహేష్, వీర్రాజు, నారాయణరావు పాల్గొన్నారు.

రూ.59.74 లక్షలతో గ్రీన్‌బెల్ట్‌లో గ్రిల్స్ ఏర్పాటు

ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, జనవరి 23, (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డులో గ్రీన్ బెల్ట్ అభివృద్ధిలో భాగంగా గ్రిల్స్ వేసే పనులను ఎమ్మెల్యే వి.విషుకుమార్‌రాజు గురువారం సత్యం కూడలిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ రూ.59.74 లక్షలతో గాంధీనగర్ నుంచి మద్దిలపాలెం, అక్కడ నుంచి సత్యం కూడలి వరకు గ్రీన్ బెల్ట్‌కు గ్రిల్స్ వేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక, జోన్-3 కమిషనర్ శివప్రసాద్, ఏసీపీ మధుసూదనరావు, ఈఈ, ఏఈ, 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, టీడీపీ వార్డు అధ్యక్షులు బర్ల పద్మలత పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

కంచరపాలెం/ ఆర్పీపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 56వ వార్డులోని గొల్లకంచరపాలెం, దుర్గానగర్, గోకుల్ నగర్ తదితర ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి కార్పొరేటర్ శరగడం రాజశేఖర్ గురువారం శంకుస్థాపన చేశారు. సుమారు రూ.20 లక్షలతోఈ పనులు చేపట్టనున్నట్టు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే పి.గణబాబు చొరవతో ఈ రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు కాండ్రేగుల రాజేశ్వరరావు, బి.రాజు రెడ్డి, పల్లా ధర్మారావు, యలమంచలి ఈశ్వరి, ప్లానింగ్ సెక్రటరీ మజ్జి గోవింద్ పాల్గొన్నారు.

సమ్మెటివ్ పరీక్షలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్



పాల్గొన్న ఉపాధ్యాయులు

అక్కయ్యపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి వారిని ప్రతిభావంతులుగా చేయాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులదేనని కలెక్టర్ హరింధర్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన ప్రభుత్వ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులతో ఇటీవల జరిగిన సమ్మిట్ పరీక్షలపై వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బి.లక్ష్మీనరసతో మాట్లాడారు. విద్యార్థులను బాగా చదివించి ఉత్తీర్ణత శాతం పెంచే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.



ఉదయం 6 గంటలకు జగదాంబ మెయిన్ రోడ్డు మార్గంలో మంచు

దట్టంగా మంచు

జగదాంబ కూడలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జగదాంబ కూడలిలో గురువారం వేకువజామున మంచు దట్టంగా కురిసింది. జగదాంబ నుంచి పూర్ణా మార్కెట్ వరకు మెయిన్ రోడ్డు మొత్తం మంచుతో మూసుకుపోయింది. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించారు.మంచుకు తోడు చల్లటి గాలులు వీయడంతో ఉదయం 8 వరకు ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాలేదు.

'మోటారు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

పూర్ణామార్కెట్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : మోటారు కార్మికులకు ఇబ్బందికరంగా మారిన 21, 31 జీఓలను ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ రెహమాన్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన టౌన్ కొత్త రోడ్డు వద్ద ఉన్న సున్నపు వీధిలో జరిగిన ఆటో యూనియన్ సమావేశంలో మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత మోటారు కార్మికులపై విపరీతమైన ఆర్థిక భారం పడుతుందని విమర్శించారు. ఇప్పటికే పెరిగిన పెట్రోలు, డీజిల్ ధరలతో పాటు చలనాల వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈనెల 31న విజయవాడలో జరిగే ఆటోడ్రైవర్లు, వర్కర్ల మహాసభలో ఈ అంశాలను చర్చిస్తామన్నారు.

కుళాయి నీరు పునరుద్ధరణ

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

జగదాంబ కూడలి, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : కనకమహాలక్ష్మి ఆలయం వద్ద భక్తులకు నీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. ముఖ్యంగా ప్రధాన ద్వారం వద్ద పాడైన కుళాయిని గురువారం నుంచి వినియోగంలోకి తీసుకువచ్చారు. మార్గశిర మాసోత్సవాలు పురస్కరించుకొని ప్రధాన ద్వారం వద్ద భక్తుల రద్దీ దృష్ట్యా కుళాయిని పూర్తిగా మూసివేశారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం రావడంతో అధికారులు స్పందించారు. ప్రధాన ద్వారం వద్ద ఉన్న కుళాయి నీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు.

తెలుగుదేశం పార్టీ ఆశాకిరణం లోకేశ్

ఎంపీ శ్రీభరత్

మర్రిపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలు 53వ వార్డు మర్రిపాలెం ఆర్అండ్‌బీ జంక్షన్ వద్ద గురువారం ఘనంగా నిర్వహించారు. పార్టీ విశాఖ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పొలమరశెట్టి శ్రీనివాసరావు, మాజీ కార్పొరేటర్ పొలమరశెట్టి నర్సకుమారి ఆధ్వర్యంలో ఎంపీ శ్రీభరత్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందాలని, యువతకు ఉద్యోగాలు రావాలన్న లక్ష్యంతో రాష్ట్రానికి పలు సంస్థలను తీసుకురావడానికి లోకేశ్ ఎంతగానో శ్రమిస్తున్నారని చెప్పారు. రాష్ట్రం కోసం, ప్రజల కోసం నిరంతరం శ్రమిస్తున్న లోకేశ్ వంటి నాయకులు రాజకీయ నాయకులకు ఆదర్శనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో విశాఖ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు గండి బాబ్జీ, వార్డు టీడీపీ అధ్యక్షుడు దస్తగిరి, సనపల వరప్రసాద్, తాతినేని శ్రీనివాసరావు, గొర్లె అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



మర్రిపాలెం : కేక్ కట్ చేస్తున్న ఎంపీ శ్రీభరత్

మహారాణిపేట :టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముస్లిం మైనారిటీ సెల్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ నజీర్ ఆధ్వర్యంలో లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేశారు.

అల్లిపురం : జీవీఎంసీ 33వ వార్డులో లోకేశ్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా డాక్టర్ చక్రవర్తి, తిరుమల దేవి వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు డీవీ ఎస్‌కే వర్రపసాద్, బీశెట్టి శ్రీనివాసరావు, సరగడం నరసింగరావు, మాధవి, మీనాక్షి, దుర్గ పాల్గొన్నారు.



బీచ్ రోడ్డులో నేతాజీ విగ్రహం వద్ద విద్యార్థులు

ఘనంగా నేతాజీ జయంతి

మహారాణిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని శ్రీ ప్రకాశ్ విద్యానికేతన్ విద్యార్థులు గురువారం ఘనంగా నిర్వహించారు. బీచ్ రోడ్డులో ఉన్న నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో చంద్రబోస్ ధైర్య సాహసాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్ చిట్లూరు వాసు ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లకు శిక్షణ

మహారాణిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నామని సీపీ శంఖబ్రాత బాగ్చి తెలిపారు. గురువారం ఆయన పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు కచ్చితంగా యూనిఫారం ధరించాలని, డ్రైవర్లకు అన్ని వివరాలతో కూడిన ఐడీ కార్డులు అందిస్తామని చెప్పారు. త్వరలో మన ఆటో, మన వైజాగ్ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు. ప్రతి ఆటోకు దాతల సహాయంతో విశాఖలోని పర్యాటక ప్రదేశాలు కనిపించేలా పెయింటింగ్ వేయిస్తామన్నారు. నగరంలో ఉన్న 4500 మంది ఆటో డ్రైవర్లను 16 బ్యాచ్‌లుగా విభజించి, 250 మంది చొప్పున శిక్షణ నిర్వహిస్తున్నామని చెప్పారు.

పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు

... 5వ పేజీ తరువాయి

జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. పంచాయతీ డెవలప్‌మెంట్ ప్లాన్ కింద ఆమోదం పొందిన పనులకు సంబంధించిన బిల్లులు మాత్రమే పీఎఫ్ఎంఎస్ నుంచి మంజూరవుతాయన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వృత్తిపన్ను కింద రూ.8.82 లక్షలు, తలసరి గ్రాంటు కింద రూ.2.95 లక్షలు, సర్పంచ్‌ల గౌరవ వేతనం కోసం రూ.50.87 లక్షలు, సీనరేజ్ కింద రూ.1.82 కోట్లు విడుదలయ్యాయన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : ఎస్ఐ

డాబాగార్డెన్స్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు సహకరించాలని టూ టౌన్ ఎస్ఐ కె. శ్రీలక్ష్మీ కోరారు. గురువారం ఆమె పాత జైల్ రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ పెట్టుకోవడం వల్ల ప్రమాదాల సమయంలో ప్రాణాపాయం నుంచి తప్పించుకోవచ్చునన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడు తూ డ్రైవింగ్ చేయరాదని సూచించారు.

ప్రమాదం జరిగే వరకూ పట్టించుకోరా..



రంగాస్ట్రీట్, లక్ష్మీస్ట్రీట్‌లో కూలిపోయే స్థితిలో ఉన్న స్తంభాలు

డాబాగార్డెన్స్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 31వ వార్డు డాబాగార్డెన్స్‌లోని పలు ప్రాంతాల్లో ఒరిగిపోయిన టెలీఫోన్ స్తంభాల వల్ల ప్రమాదం పొంచి ఉంది. ప్రమాదం జరిగితేగాని అధికారులు చర్యలు తీసుకోరా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రంగాస్ట్రీట్, లక్ష్మీస్ట్రీట్, శారదాస్ట్రీట్, ప్రేమ సమాజం తదితర ప్రాంతాల్లోని టెలిఫోన్ స్తంభాలు కూలిపోయే స్థితిలో ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు, సిబ్బందికి చలనం లేకుండాపోతోంది. ఆయా ప్రాంతాల్లో వివిధ పాఠశాలలు ఉన్నాయి. చిన్నారులు, పాదచారులు వాటి పక్క నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. మరికొందరు పాదచారులు, వృద్ధులు రోడ్డుపై నడిస్తే వాహనాలు ఢీకొడతాయన్న భయంతో పక్కకు నడుస్తుంటారు. అయితే రాత్రి వేళలో భారీ వాహనాల రాకపోకలు సాగించే సమయంలో ఒరిగిపోయిన స్తంభం తగిలీ ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ ప్రాంతాల్లో స్తంభాల పరిస్థితి ఇలా ఉన్నా పట్టించుకునే నాధుడే లేరని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పోలీసుల అదుపులో నకిలీ మహిళా ఐఏఎస్!

... 5వ పేజీ తరువాయి

ఇచ్చిన వారిని కూడా పోలీసులు విచారిస్తున్నట్టు సమాచారం. దీనిపై ఎంవీపీ పోలీస్‌స్టేషన్ అధికారులు గోప్యత పాటిస్తుండడంతో సీపీ శంఖబ్రతబాగ్చిని వివరణ కోరగా నకిలీ ఐఏఎస్‌తోపాటు ఆమె భర్తపై ఉద్యోగాలిప్పిస్తామని డబ్బులు వసూలు చేసినట్టు ఫిర్యాదు అందినమాట వాస్తవమేనన్నారు. త్వరలోనే దీనికి సంబంధించిన పూర్తివివరాలను వెల్లడిస్తామని సీపీ తెలిపారు.

విశాఖ-దుర్గ్ వందే భారత్ కోచ్‌లలో కోత

... 5వ పేజీ తరువాయి

ఎనిమిది కోచ్‌లతోనే విశాఖ-దుర్గ్ వందే భారత్ రైలు నడపాలని నిర్ణయించారు. దీనిని శుక్రవారం నుంచే అమలు చేస్తారు. ఇందులో ఏడు కోచ్‌లు చైర్ కార్ సౌకర్యంతో ఉంటాయి. ఒక్కోదాంట్లో 70 సీట్లు ఉంటాయి. ఒక కోచ్ మాత్రం ఎగ్జిక్యూటివ్ చైర్ సదుపాయాలతో ఉంటుంది. ఇందులో సీట్లు కేవలం 40 మాత్రమే ఉంటాయి. రిజర్వేషన్ వివరాలు పరిశీలిస్తే 24వ తేదీ నాటికి చైర్ కారు సీట్లు 307 ఖాళీ ఉన్నాయి. ఏడు కోచ్‌లకు మొత్తం సీట్లు 490 కాగా 183 బుక్ అయ్యాయి. ఎగ్జిక్యూటివ్ చైర్స్ చూస్తే 24వ తేదీకి 29 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అంటే 40లో కేవలం 11 మాత్రమే రిజర్వ్ అయ్యాయి. ఇలా ఆదరణ తక్కువగా ఉన్నందున సగానికి కోచ్‌లు తగ్గించామని, దీనిని కూడా కొన్నాళ్లు పరిశీలించి అవసరమైతే మరిన్ని కోచ్‌లు తగ్గించే అవకాశం ఉందని రైల్వే వర్గాలు తెలిపాయి. ఖాళీగా ఉండే ఈ కోచ్‌లను డిమాండ్ ఉన్న మార్గంలో సెట్ చేస్తామని వివరించారు. పూర్తిగా విశాఖ-దుర్గ్ వందే భారత్ రైలు రద్దు చేయడం అంత వేగంగా కుదరదని ఓ అధికారి అభిప్రాయపడ్డారు.

కూటమి విజయంలో లోకేశ్ పాత్ర కీలకం

... 5వ పేజీ తరువాయి

గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పీవీజీఆర్ నాయుడు (గణబాబు), పంచకర్ల రమేష్‌బాబు, సీహెచ్.వంశీకృష్ణ శ్రీనివాస్‌లతో కలిసి భారీ కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జన్మదిన వేడుకలకు కూడా దూరంగా ఉండి రాష్ట్రాభివృద్ధి కోసం, రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావడం కోసం దావోస్ పర్యటనలో లోకేష్ బిజీగా ఉన్నారన్నారు. యువగళం పాదయాత్రతో నారా లోకేష్ ఆంధ్రప్రదేశ్‌లో సరికొత్త అధ్యాయం సృష్టించారని కొనియాడారు. వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ మాట్లాడుతూ ఎటువంటి బ్యాక్ గ్రౌండ్ లేని తనలాంటి సాధారణ వ్యక్తికి గొప్ప అవకాశమిచ్చిన ఘనత లోకేష్‌కు దక్కుతుందన్నారు. ఆయన జన్మదిన వేడుకల్లో భాగంగా రక్తదానం పెద్దఎత్తున నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలదీపికా, కూటమి నేతలు పాల్గొన్నారు.

'దేశం'లో లుకలుకలు!

... 5వ పేజీ తరువాయి

రాజబాబు, వీఎంఆర్‌డీఏ మాజీ చైర్‌పర్సన్ అక్కరమాని నిర్మల, అన్ని అనుబంధ సంఘాల నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు నలుగురూ హాజరుకాలేదు. పార్టీ కార్యాలయంలో జరిగే ప్రతి కార్యక్రమం గురించి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలు, అనుబంధ సంఘాల నేతలకు కార్యాలయ వర్గాలు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తాయి. లోకేశ్ జన్మదిన వేడుకల నిర్వహణకు సంబంధించిన సమాచారం కూడా అలాగే ఇచ్చాయి. కానీ ఎమ్మెల్యేలు రాలేదు. ఇదిలావుండగా వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎం.ప్రణవ్‌గోపాల్ సొంతంగా వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో నిర్వహించిన లోకేశ్ జన్మదిన వేడుకలకు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ శ్రీభరత్ (రెండుచోట్ల పాల్గొన్నారు) ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, పి.గణబాబు, జనసేన ఎమ్మెల్యేలు పంచకర్ల రమేష్‌బాబు, వంశీకృష్ణ శ్రీనివాస్, బీజేపీ నాయకులు హాజరయ్యారు. అయితే కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడంపై పార్టీలో చర్చ జరిగింది. నగరంలో కొద్దిరోజులుగా తెలుగుదేశం ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు రెండు వర్గాలుగా విడిపోయారు. ఈ మేరకు అధిష్టానం వద్ద కూడా సమాచారం ఉందని చెబుతున్నారు.

బడాబాబులకు సహకారం

... 5వ పేజీ తరువాయి

అవుట్‌లెట్లను రిలయన్స్ గ్రూపు టేకోవర్ చేసింది. అందులో విశాఖపట్నం కూడా ఉంది. సూపర్‌బజార్ ముందున్న సెంట్రల్ మాల్‌ను పూర్తిగా ఆధునికీకరించి, రీమోడల్ చేసి 'సెంట్రో' పేరుతో విశాఖ ప్రజల ముందుకువచ్చింది. ఇదంతా సూపర్ బజార్ అధికారుల కళ్ల ముందే జరిగింది. తమ స్థలాన్ని తాకట్టు పెట్టి రూ.వందల కోట్లు డబ్బులు తినేయడమే కాకుండా భవనాన్ని వేరొకరికి సబ్ లీజుకు ఇచ్చేస్తున్నా సహకారశాఖ అధికారులు నోరెత్తలేదు. ఏమీతెలియనట్టుగా కళ్లుమూసుకున్నారు. పైగా ఆడిట్‌లో బ్యాంక్ నోటీసు చూశాకే విషయం తెలిసిందని బుకాయిస్తున్నారు. వీరి నంగనాచి కబుర్లనుజిల్లా ఉన్నతాధికారులూ నమ్మడం మరో విశేషం.ఈ కేసులో ప్రజాప్రతినిధులు కూడా దీనిపై స్పందించకపోవడం గమనార్హం.

అద్దె ఎంత కట్టింది?

స్థలాన్ని లీజుకు తీసుకున్న సుహానీ సంస్థ (ఫ్యూచర్ గ్రూపు) కరోనా తరువాత విశాఖ సెంట్రల్ షాపింగ్ మాల్ కొన్నేళ్లు మూసేసింది. మొదట్లో (2008) నెలకు రూ.12 లక్షలు అద్దెగా నిర్ణయించారు. ఇది 33 ఏళ్ల లీజు ఒప్పందం కాబట్టి ఏడాదికేడాది అద్దె పెరుగుతుంది. దివాలా తీసిన సంస్థ సుమారుగా రెండేళ్లు మూతపడిన కాలానికి అద్దె ఎలా కట్టింది?, ఎంత కట్టింది? అనేది మాత్రం చెప్పడం లేదు. ఎవరికీ రూపాయి చెల్లించని సంస్థ వీరికి అద్దె ఎలా కట్టిందో జిల్లా అధికారులే చెప్పాలి.

ఆడిట్‌లో వెలుగుచూసిన సూపర్ బజారు బాగోతం

విశాఖపట్నం : సూపర్ బజారు స్థలాన్ని బ్యాంకులో తాకట్టు పెట్టి లీజుదారులైన సుహానీ షాపింగ్ మాల్ యజమానాలు రూ.350 కోట్ల రుణం తీసుకున్నట్టు 2022-23 ఆడిట్ నివేదికలో వెల్లడైందని సూపర్ బజారు ఎండీ శ్రీనివాసరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అందులో ఇంకా రూ.129 కోట్లు బకాయి ఉందని, దానిపై న్యూఢిల్లీలోని డెట్ రికవరీ ట్రైబ్యునల్‌లో ఆర్‌బీఎల్ బ్యాంకు దావా వేసిందని, అందులో తమను కూడా భాగస్వామిగా చేర్చిందని వివరించారు. ఆ కేసులో వాదనలు వినిపిస్తున్నామని, మరో వైపు 51 విచారణ జరుగుతోందని, దానిపై నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

టూరిజం మోడల్ సిటీగా విశాఖ

... 5వ పేజీ తరువాయి

ప్రతిపాదనలు పంపాలన్నారు. జాతీయ, అంతర్జాతీయ పర్యాటకులు వస్తే ఎక్కువ రోజులు నగరంలో ఉండేలా పర్యాటక అభివృద్ధి జరగాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో అందుబాటులో ఉండేలా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలన్నారు. భద్రతా ప్రమాణాలు కూడా చాలా ముఖ్యమన్నారు.

పీపీపీ విధానంలో వీఎంఆర్‌డీఏ ప్రాజెక్టులు

ఈ సమావేశంలో పాల్గొన్న వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా చేపడుతున్న పర్యాటక ప్రాజెక్టులను వివరించారు. కైలాసగిరిపై నేచర్ కాటేజీలు, బీచ్ వ్యూ కేఫ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఫైవ్ స్టార్ వసతులతో కన్వెన్షన్ సెంటర్, రుషికొండలో హేబిటేషన్ సెంటర్, మధురవాడలో అర్బన్ ఎంటర్‌టెయిన్‌మెంట్ జోన్, మెడికల్ టూరిజంలో భాగంగా అనకాపల్లిలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తున్నామన్నారు. ఎమ్యూజ్‌మెంట్ పార్క్ ఏర్పాటుకు కూడా ప్రణాళికలు ఉన్నాయన్నారు. జీసీసీ ఎండీ కల్పనకుమారి మాట్లాడుతూ అరకు కాఫీగా ప్రపంచస్థాయి గుర్తింపు తీసుకువచ్చామని, కాఫీ తోటల్లో ఎక్స్‌పీరియన్స్ సెంటర్ ఏర్పాటు చేయనున్నామని చెప్పారు. జూ పార్కులో మరిన్ని సౌకర్యాలు కల్పిస్తామని క్యూరేటర్ మంగమ్మ చెప్పారు. సమావేశంలో పర్యాటక శాఖ అధికారులు శ్రీనివాస్, జ్ఞానవేణి, జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు బోల్తా

... 5వ పేజీ తరువాయి

ఉద్యోగి. బుధవారం రాత్రి పది గంటల సమయంలో విశాఖపట్నంలో బయలుదేరిన కావేరి ట్రావెల్స్ బస్సు అర్ధరాత్రి 12:30 గంటల సమయం దాటేసరికి తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు జీరో పాయింట్ నుంచి గామన్ బ్రిడ్జి రోడ్డులోకి మళ్లింది. కొంతమూరు దాటి కాతేరు గ్రామ పరిధిలోకి వెళ్లేసరికి ఎదురుగా ఒక స్కూటీ రావడంతో దాన్ని తప్పించే క్రమంలో బస్సు డివైడర్‌పైకి ఎక్కి బోల్తా కొట్టి 200 మీటర్లు దూసుకుపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే లోపల నుంచి ఆర్తనాదాలు వినిపించడంతో స్థానికులు స్పందించి సెల్‌ఫోన్ల లైట్ల వెలుగులో బస్సు వెనుక అత్యవసర ద్వారాన్ని పగులగొట్టి అందరినీ బయటకు తీశారు. సమాచారం అందిన వెంటనే తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహకిషోర్ వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. త్రీటౌన్ సీఐ అప్పారావు, పోలీసులు క్షతగాత్రులను 108 అంబులెన్సుల్లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కళ్యాణి (21) మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు. డ్రైవర్ పరారయ్యాడు. అతను మద్యం సేవించి ఉన్నాడేమోనని పోలీసులు అనుమానిస్తున్నారు. రెండో డ్రైవర్ గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

బస్సు బోల్తాపడిన సంఘటనలో చిన్నకుమార్తె దుర్మరణం పాలవడంతో పెద్దకుమార్తెను పట్టుకుని తల్లి కోన లక్ష్మి రోదిస్తున్న తీరు అక్కడున్నవారిని కలచివేసింది. కల్యాణి తండ్రి రాఘవదాసు విశాఖపట్నం రైల్వేలో ఉద్యోగం చేస్తున్నారు. మర్రిపాలెంలో నివాసం ఉంటున్నారు. రాఘవదాసుకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె కల్యాణి విశాఖపట్నంలోని విజ్ఞాన్ విద్యాసంస్థల్లో బీటెక్ ఫైనలియర్ చదువుతోంది. గురువారం హైదరాబాద్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఇంటర్వ్యూకు హాజరుకావాల్సి ఉంది. తన బంధువైన దీక్షితతో కలసి కావేరీ ట్రావెల్స్ బస్సులో హైదరాబాద్ బయలుదేరింది. ప్రమాదంలో నెల్లిమర్లకు చెందిన సంతోష్, గాజువాకకు చెందిన కె.ఫాతిమాబేగం, తునికి చెందిన పి.రాజ్యలక్ష్మి, అన్నవరానికి చెందిన కె.దేవిలకు తీవ్ర గాయాలయ్యాయి.

రామానాయుడు స్టూడియోలో సుమన్


షూటింగ్‌లో పాల్గొన్న సుమన్

సాగర్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): భీమిలి బీచ్ రోడ్డు రామానాయుడు స్టూడియోలో గురువారం సీనియర్ నటుడు సుమన్ సందడి చేశారు. నూతనంగా నిర్మిస్తున్న ఓ చిత్రంలోని కొన్ని సన్నివేశాలను ఇక్కడ చిత్రీకరించారు. చిత్రం టైటిల్ ,పూర్తి వివరాలను త్వరలో మీడియా ముందు వెల్లడిస్తామని యూనిట్ తెలిపింది.

ఇద్దరు బాలురు అదృశ్యం

ఎంవీపీ కాలనీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఎంవీపీ స్టేషన్ పరిధిలో ఇద్దరు బాలురు అదృశ్యం అయిన కేసులు నమోదయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. నక్కవానిపాలెం క్రాంతినగర్‌కు చెందిన 13 ఏళ్ల బాలుడు చాట్ల దీరజ్ తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం 5 గంటలకు స్నేహితుడి పుట్టిన రోజు అంటూ బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అలాగే సమీప ప్రాంతమైన చైతన్యనగర్‌కు చెందిన 14 ఏళ్ల బాలుడు దత్తి యశ్వంత్ కూడా అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు ట్యూషన్‌కు అని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఇద్దరూ తిరిగి ఇంటికి రాలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వీరిద్దరూ ఒకే స్కూల్‌లో చదువుతుండడంతో కలసి వెళ్లినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఇందులో ఒక బాలుడు తన వెంట సెల్‌ఫోన్ తీసుకువెళ్లాడు. సిగ్నల్ ఆధారంగా బాలురు ఆచూకీ కోసం పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

గ్రీన్‌బెల్ట్‌లో గ్రిల్స్ ఏర్పాటు


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు

సీతమ్మధార, జనవరి 23, (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ విశాఖ 24వ వార్డులో గ్రీన్ బెల్ట్ అభివృద్ధిలో భాగంగా గ్రిల్స్ వేసే పనులను ఎమ్మెల్యే పి.విషుకుమార్‌రాజు గురువారం సత్యం కూడలిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ రూ.59.74 లక్షలతో గాంధీనగర్ నుంచి మద్దిలపాలెం, అక్కడ నుంచి సత్యం కూడలి వరకు గ్రీన్ బెల్ట్‌కు గ్రిల్స్ వేయనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకురాలు శ్యామలాదీపిక, జోన్-3 కమిషనర్ శివప్రసాద్, ఏసీపీ మధుసూదనరావు, ఈఈ, ఏఈ, 24వ వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి, టీడీపీ వార్డు అధ్యక్షులు బర్ల పద్మలత పాల్గొన్నారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం :** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్ :** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్ :** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం),కన్యకాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 35, టమాటా 14, వంకాయలు (తెలుపు)28, వంకాయలు (నలుపు) 36, బెండకాయలు 46, పచ్చిమిర్చి 42, కాకరకాయలు 44, బీరకాయలు 52, ఆనపకాయ 16, కాలీఫ్లవర్ 20, క్యాబేజి 15, క్యారెట్ 36 దొండకాయలు 36, బంగాళదుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 36, ముల్లంగి 24, నిమ్మకాయలు (కిలో) 65, బద్దచిక్కుడు 24, దోస కాయలు 32, వె ల్లుల్లి (పెద్దవి) 290, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 42, పొటల్స్ 80, కీరదోస 34, కాప్సికమ్ 46, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 50, చిలగడ దుంపలు 40, కంద 56, దేముడు చిక్కుడు 40, గోరు చిక్కుడు 30, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 26, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 70, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాల కూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 30, కర్రపెండలం 20, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	485
విజయనగరం	489
శ్రీకాకుళం	489

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	125
లైవ్ ధర	145
విత్ స్కిన్	260
స్కిన్‌లెస్	270


మద్దిలపాలెం : అన్నదానంలో పాల్గొన్న ఎమ్మెల్యే వెలగపూడి తదితరులు


వెంకోజీపాలెం : కేక్ కట్ చేస్తున్న టీడీపీ నేతలు


ఎంవీపీకాలనీ : ఎంపీ రమేశ్‌కు కేక్‌తినిపిస్తున్న కార్పొరేటర్ మంగమణి

టీడీపీలో కొత్త జోష్ నింపిన లోకేశ్

» యువనేతకు పలువురి ప్రశంసలు » తెలుగుదేశం నేతల ఆధ్వర్యంలో ఘనంగా జన్మదిన వేడుకలు » పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు

రాష్ట్ర ఐటీ, విద్యాశాఖామంత్రి నారా లోకేశ్ జన్మదిన వేడుకలను గురువారం తెలుగుదేశం పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పలు ప్రాంతాల్లో నిర్వహించిన వేడుకల్లో టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో వక్తలు మాట్లాడుతూ లోకేశ్ నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ కొత్త ఉత్సాహంతో ఉరకలేస్తుందన్నారు.

మద్దిలపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : స్థానిక 22వ వార్డు పిఠాపురంకాలనీలో కార్పొరేటర్ బొట్టా నీలిమ, వెంకటరమణ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు పాల్గొని కేక్ కట్ చేశారు. భారీ అన్నసంతర్పణ చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ లోకేష్ యువగళం పాదయాత్రతో వైసీపీ రాక్షస పాలన ప్రజల్లోకి తీసుకుని వెళ్లి కూటమి పార్టీలు విజయానికి కీలకపాత్ర పోషించారన్నారు. ఆయన నాయకత్వంలో టీడీపీకి కొత్త జోష్ వచ్చిందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొట్టా వెంకటరమణ, దువ్వి స్వామి, ఒమ్మి అప్పారావు తదితరులు పాల్గొన్నారు. అలాగే జీవీఎంసీ 23వ వార్డు చైతన్య నగర్‌లో కార్పొరేటర్ గుడ్ల విజయసాయిసత్యారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేశారు. టీడీపీ నాయకులు గొలగాని పురుషోత్తం, బోస రాంబాబు, గాలి అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రామ్‌నగర్‌లో..

రామ్‌నగర్ : విశాఖ సేవాసదన్ పాఠశాల విద్యార్థుల సమక్షంలో మంత్రి నారా లోకేష్ జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు, టీడీపీ వార్డు ఇన్‌చార్జి నక్కా కనకరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు, నేతలు కేక్ కట్ చేశారు. స్కూల్ కరస్పాండెంట్ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం రాంబాబు, అప్పలరాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ : జీవీఎంసీ 18వ వార్డులోని ఎంవీపీ రెండో సెక్టరులోని అంజయ్యనగర్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎంపీశ్రీభరత్ పాల్గొన్నారు. తెలుగు మహిళా నేతల మధ్య కార్పొరేటర్ గొలగాని మంగవేణి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, వీఎమ్మార్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం, వార్డు అధ్యక్షుడు గొలగాని పోలరావు పాల్గొన్నారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం : గ్రేటర్ విశాఖ 15, 16 వార్డుల్లో లోకేశ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. 16వ వార్డు ఇసుకతోట జంక్షన్‌లో టీడీపీ వార్డు అధ్యక్షులు నారు గోపి, ముగడ వాసు, మొల్లి శంకర్ తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అలాగే 15వ వార్డులోని హెచ్‌బీ కాలనీ జంక్షన్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ వార్డు అధ్యక్షుడు బుగత సత్యనారాయణ, గవర కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ వార్డు ప్రధాన కార్యదర్శి మళ్ల రవికుమార్, నేతలు సీహెచ్ గోవింద్, మళ్ల వెంకట్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఇసుకతోటలో గల బీసీ హాస్టల్‌లో చిన్నారులకు వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ పుస్తకాలు పంపిణీ చేశారు. విశాఖ తూర్పు తెలుగు మహిళా అధ్యక్షురాలు పల్లా ఉమారాణి, ముగడ వాసు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

ఆరిలోవలో..

ఆరిలోవ : జీవీఎంసీ 12వ వార్డులో పరిధి తోటగరువులోని టీడీపీ వార్డు కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి ఒమ్మి సన్యాసిరావు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. టీడీపీ వార్డు అధ్యక్షుడు గాడి సత్యం, ఇన్‌చార్జి ఒమ్మి అప్పలరాజు, పార్లమెంటరీ కార్యదర్శులు ఒమ్మి పోలారావు, ఏడువాక సన్యాసిరావు, రాపర్తి గణపతి తదితరులు పాల్గొన్నారు. అలాగే 13వ వార్డులో టీడీపీ ప్రధాన కార్యదర్శి యల్లమిల్లి సురేశ్, తెలుగుమహిళాఅధ్యక్షురాలు, కమిటీ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. జీవీఎంసీ 10వ వార్డులో కార్పొరేటర్ మద్దిల రామలక్ష్మి ఆధ్వర్యంలో లోకేశ్ పుట్టిన రోజు వేడుకలు నిర్వహించారు. ఆ పార్టీ వార్డు అధ్యక్షుడు గాడు అప్పలనాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి మద్దిల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పెదవాల్తేరులో..

పెదవాల్తేరు : టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి చోడే వెంకట పట్టాభిరామ్ ఆధ్వర్యంలో పెదవాల్తేరులోని మానసిక దివ్యాంగుల పాఠశాలలో మంత్రి లోకేశ్ జన్మదినవేడుకలు నిర్వహించారు. విశాఖ పార్లమెంటరీ టీడీపీ ఉపాధ్యక్షుడు బైరెడ్డి పోతన్నరెడ్డి, 17వ వార్డు టీడీపీ అధ్యక్షుడు కాళ్ల శంకర్, ఎన్ సత్తిబాబు, వాసు మానసిక దివ్యాంగుల పాఠశాల నిర్వాహకులు కండిపిల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. అలాగే టీడీపీ 21వ వార్డు అధ్యక్షుడు పీతల అమరేంద్ర ఆధ్వర్యంలో చినావాల్తేరు హోమన హోటల్ జంక్షన్‌లో కేక్ కట్ చేశారు. మూర్తియాదవ్, మదీనా, ప్రసన్న కుమార్, వినయ్, రమేష్, వెంకట్రావు, కనకరావు పాల్గొన్నారు.


రామ్‌నగర్ : సేవా సదన్ పాఠశాల విద్యార్థులతో కేక్ కట్ చేయిస్తున్న కనకరాజు తదితరులు


ఆరిలోవ : కేక్ కట్ చేసి నేతలకు పంచుతున్న ఒమ్మి సన్యాసిరావు



స్మార్ట్‌పోల్‌తో జర జాగ్రత్త!

స్మార్ట్‌సిటీలో భాగంగా 2016లో నగరంలో ఎక్కడికక్కడ ఏర్పాటుచేసిన స్మార్ట్‌పోల్స్ నిర్వహణ లేక ప్రమాదకరంగా మారాయి. బీచ్‌రోడ్డులోని స్మార్ట్‌పోల్ పైన రేకులు సముద్ర గాలికి చెదిరిపోయాయి. రెండు రేకులు కిందికి రాలిపోగా, మరో రెండు వేలాడుతున్నాయి. ఆ రోడ్డులో నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ఏ క్షణంలో ఎవరిపైన పడిపోతాయోనని వాహనచోదకులు, సందర్శకులు ఆందోళన చెందుతున్నారు.


బీచ్‌రోడ్డులోని స్మార్ట్‌పోల్

- విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

రక్తదానానికి యువత ముందుండాలి


రక్తదాన శిబిరంలో పాల్గొని విద్యార్థులను అభినందిస్తున్న ఏయూ వీసీ శశిభూషణరావు, రిజిస్ట్రార్ ధనుంజయరావు తదితరులు

వెంకోజీపాలెం, మద్దిలపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని ఏయూ వీసీ జి.శశిభూషణరావు, రిజిస్ట్రార్ ఈఎన్ ధనుంజయ రావులు ప్రారంభించారు. రక్తదానం చేసిన విద్యార్థులను ఈ సందర్భంగా అభినందించారు. ఏయూలో ప్రతి సంవత్సరం స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ నగరంలో రక్త కొరత ఏర్పడుతోందని దీని నివారించే విధంగా విద్యార్థులు రక్తదానం చేయడానికి ముందుకు రావడం సంతోషకరమన్నారు. విద్యార్థులు రక్తదానం చేయడం వలన మరో ముగ్గురి ప్రాణాలను కాపాడడం సాధ్యపడుతుందని చెప్పారు. రిజిస్ట్రార్ ధనుంజయరావు మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యవంతమైన అలవాట్లను కలిగి ఉండాలని కాలానుగుణంగా రక్తదానం చేయాలని సూచించారు. ఇటువంటి సామాజిక స్పృహ కలిగిన కార్యక్రమాలలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏయూలో చదువుతున్న భారతీయ విద్యార్థులతో పాటు పలువురు విదేశీ విద్యార్థుల సైతం రక్తదానం చేశారు. విద్యార్థులు స్వచ్ఛందంగా అందించిన రక్తాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ రక్తనిధి కేంద్రానికి, ఎన్టీఆర్ ట్రస్టు రక్తనిధి కేంద్రాలకు అందజేశారు. రక్తదానం చేసిన విద్యార్థులకు అధికారులు సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ కె.ఈశ్వర్‌కుమార్, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ఎస్.హరినాథ్, దూరవిద్యా సంచాలకులు ఎన్.విజయమోహన్, అంతర్జాతీయ విద్యార్థుల హాస్టల్స్ చీఫ్ వార్డెన్ డాక్టర్ ఎన్‌ఎం యుగంధర్, విద్యార్థి వ్యవహారాల డీన్ రాంబాబు, ఆచార్య పాల్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ 22వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి, ఏఐవైఎఫ్ ప్రతినిధులు

వెంకోజీపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : వచ్చే 6 నాలుగు రోజుల పాటు శ్రీకాకుళంలో జరగనున్న అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 22వ రాష్ట్ర మహాసభల గోడ పత్రికను తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, మాదవ ద్రవ్యాలు వంటి మత్తు పదార్థాలపై యువత పోరాడాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ, నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి హామీ గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. శ్రీకాకుళంలో జరిగే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలు విజయవంతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు పడాల గోవింద్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్.మధురెడ్డి, గోవింద్, ఏఐవైఎఫ్ కౌన్సిల్ సభ్యులు రావి అశోక్, తేజ పోలారావు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు నేతాజీ

మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్


నేతాజీకి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నేతలు

రామ్‌నగర్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : స్వాతంత్ర సమరంలో రాజీ లేని పోరు సలిపి ప్రజల హృదయాల్లోచిరంజీవిగా ఉండిపోయిన మహనీయుడు నేతాజీ సుభాస్ చంద్రబోస్ అని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ అన్నారు. గురువారం నేతాజీ 128వ జయంతి సందర్భంగా భారతీయ జనతా పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్‌ఎమ్‌ఎన్ పరశురామ్‌రాజు ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మాధవ్ మాట్లాడుతూ రెండు జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షుడుగా వ్యవహరించిన నేతాజీ.. సిద్ధాంతపర భేదాలతో గాంధీజీని వ్యతిరేకించి స్వాతంత్ర్య పోరాటానికి వేరే మార్గాన్ని అనుసరించారన్నారు. ధైర్యమే తన ఆయుధంగా ముందడుగు వేశారన్నారు. సొంత సైన్యాన్ని స్థాపించి ఆంగ్లేయులపై పోరాటానికి సమాయత్తం అయారన్నారు. నేటి తరానికి నేతాజీ ఆదర్శప్రాయులన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు, నేతలు ఉమ్మడి సుజాతారాజ్, కేతినేని సురేంద్రమోహన్ వెంగబాబు శ్రీనివాసబాబు, ధనేశ్వరరావు రోహిణి తదితరులు పాల్గొన్నారు

ఏయూ మ్యూజిక్ ప్రొడక్షన్ సందర్శించిన

వేణుగాన విద్వాంసుడు నవీన్‌కుమార్


నవీన్‌కుమార్‌ను సత్కరిస్తున్న రిజిస్ట్రార్ ధనుంజయరావు, ఏయూ అధికారులు

వెంకోజీపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : విశాఖ నగరానికి విచ్చేసిన ప్రముఖ వేణుగాన విద్వాంసుడు, సంగీత దర్శకుడు, లైవ్ పెర్ఫార్మర్ పీఎంకే నవీన్‌కుమార్ ఏయూలోని సెయింట్ లూక్స్ ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ విభాగాన్ని గురువారం సందర్శించారు. ఆధునిక ప్రమాణాలతో నిర్మించిన సెయింట్ లూక్స్ డిజిటల్ స్టూడియో చూసి ఆయన ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ప్రపంచ ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఇళయరాజా, ఏఆర్ రెహ్మాన్, హరీష్‌జయరాజ్, డీఎస్పీ, యస్‌యస్ తమన్ వంటి ఎందరో సంగీత దర్శకుల బృందంలో నవీన్‌కుమార్ వేణుగాన విద్వాంసునిగా తన ప్రత్యేకతను చాటుకున్నారు. ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ విద్యార్థులు, వుడ్ విండ్స్ వాయిద్యాల విభాగాల్లో మాస్టర్ క్లాస్ నిర్వహించి వేణుగానంలో మెళకువలను నేర్పించారు. తదుపరి ఆయన తన వేణుగానంతో రోజా, బాంబే వంటి చిత్రాల నుంచి ప్రేక్షకులను అలరించిన బాణీలను వినిపించారు. ఈ కార్యక్రమంలో సెయింట్ లూక్స్ ఆడియో ఇంజనీరింగ్, మ్యూజిక్ ప్రొడక్షన్ విద్యార్థులతో పాటు డైరెక్టర్ ఆశీర్వాద్ లూక్, సుమన్ జీవరతన్, ప్రీతంలూక్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఏయూ రిజిస్ట్రార్ ఈయన్ ధనుంజయరావు తన కార్యాలయంలో నవీన్‌కుమార్‌ను సత్కరించారు. నవీన్‌కుమార్ విశాఖలో పుట్టిపెరిగి, ఏయూ ఫైన్ ఆర్ట్స్ విభాగంలో పూర్వ విద్యార్థి కావడం ఎంతో సంతోషంగా రిజిస్ట్రార్ అన్నారు.

విద్యార్థుల బాధ్యత హెచ్‌ఎంలదే..

సమ్మిటివ్ పరీక్షలపై కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్


వీడియో కాన్ఫరెన్స్‌లో సూచలిస్తున్న కలెక్టర్ హరిందర్ ప్రసాద్

అక్కయ్యపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉత్తమ బోధన అందించి వారిని ప్రతిభావంతులుగా చేయాల్సిన బాధ్యత ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులదేనని కలెక్టర్ హరిందర్ ప్రసాద్ పేర్కొన్నారు. గురువారం ఆయన ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో ఇటీవల జరిగిన సమ్మిట్ పరీక్షలపై వెబెక్స్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇందులో భాగంగా 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలోని జీవీఎంసీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బి.లక్ష్మీనరసతో మాట్లాడారు. విద్యార్థులను బాగా చదివించి ఉత్తీర్ణత శాతం పెంచే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్పీ భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంజయ్యనగర్‌లో దోబీఘాట్ ప్రారంభం


దోబీఘాట్ ప్రారంభిస్తున్న ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి, కార్పొరేటర్ మంగమణి, వీఎంఆర్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్

ఎంవీపీ కాలనీ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ విశాఖ 18వ వార్డు పరిధిలోని అంజయ్యనగర్‌లో రూ.19.90 లక్షలతో నిర్మించిన దోబీఘాట్‌ను ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కార్పొరేటరు గొలగాని మంగవేణి మంగళవారం ప్రారంభించారు. ఈ ప్రాంతంలో దోబీఘాట్ అవసరమన్న స్థానికుల వినతి మేరకు జీవీఎంసీ నిధులు మంజూరు చేసింది. నిర్మాణం పూర్తి చేసి, గ్రామస్థులకు అప్పగించారు. వీఎమ్మార్డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చోడె పట్టాభిరాం, వార్డు అధ్యక్షుడు గొలగాని పోలరావు, జీవీఎంసి డీఇ పద్మావతి, ఈఈ గంగాధర్, ఎఈ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు

సందడిగా పరస మహోత్సవం


పరసనలో జానపద కళా ప్రదర్శన ఇస్తున్న కళాకారులు

వెంకోజీపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ 15వ వార్డులోని పాతవెంకోజీపాలెంలో శ్రీ సీతారామ సేవా సంఘం ఆధ్వర్యాన గురువారం సాయంత్రం పరస మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. తినుబండారాలు, ఆట వస్తువులు, గృహోపకరణాల విక్రయం, సాంస్కృతిక కార్యక్రమాలు తదితరాలతో ఈ ప్రాంతమంతా సందడిగా మారింది. ఇక్కడి సీతారామాలయం, సాయిబాబా ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం విద్యుత్ కాంతులతో నిండిన పరస మహోత్సవంలో చిన్నారుల నుంచి పెద్దల వరకు పాల్గొని సరదాగా గడిపారు. . ఈ సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బుర్రకథ సాంస్కృతిక కార్యక్రమం అందరిని అలరించింది. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షులు పీల వెంకటపరదేశినాయుడు , అధ్యక్షులు ఆడారి పరదేశినాయుడు, ఉపాధ్యక్షులు కర్రి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి యల్లపు నాగరాజు, కార్యదర్శి ఆడారి శివప్రకాష్, కోశాధికారి పొలమరశెట్టి త్రినాథ్, సహాయ కార్యదర్శులు ఆర్.సురేష్, కర్రి రఘు, మాజీ డిప్యూటీ మేయర్ మళ్ల అప్పలరాజు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

గ్రీన్‌బెల్ట్‌లో మళ్లీ

కార్ల వ్యాపారం మొదలు

» నామమాత్రపు చర్యలకే అధికారులు పరిమితం

» ఇసుకతోటలో తప్పని ట్రాఫిక్ అవస్థలు


ఇసుకతోట గ్రీన్‌బెల్ట్‌లో సెకండ్ సేల్‌కు పెట్టిన కార్లు

మద్దిలపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ఇసుకతోట నుంచి ఆటోమోటివ్ జంక్షన్‌కు వచ్చే జాతీయరహదారి గ్రీన్‌బెల్ట్‌లో మళ్లీ కార్ల వ్యాపారం ప్రారంభించారు. ముందుగా మూడు కార్లను తీసుకొచ్చి గ్రీన్‌బెల్ట్‌లో కొనుగోలుకు పెట్టారు. ఏళ్ల తరబడి ఇక్కడ గ్రీన్‌బెల్ట్‌లో సెకెండ్ హ్యాండ్ కార్ల వ్యాపారాలు సాగుతోంది. దీనిపై కొన్ని నెలల కిందట 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు రావడంతో జీవీఎంసీ అధికారులు స్పందించి గత నెల 22న గ్రీన్‌బెల్ట్‌లో కార్ల వ్యాపారం చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసి ఖాళీ చేయించారు. దీంతో.. ఎప్పుడూ వాహనాల రద్దీతో ఉండే ఈ ప్రాంతం లో కాస్త ట్రాఫిక్‌కు వెసులుబాటు కలిగింది. అయితే ఆ తరువాత అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో ఆటోమొబైల్ కంపెనీ ప్రతినిధులు మళ్లీ గ్రీన్‌బెల్ట్‌ను ఆక్రమించి వ్యాపారాలు చేయడం మొద లు పెట్టారు. నేవీ డే, ప్రధానమంత్రి సభ ఏర్పాట్లలో జీవీఎంసీ అధికారులు బిజీగా ఉండడంతో అధికారులు ఈ విష యాన్ని పట్టించుకోలేదని అంతా భావించారు.అయితే రోజులు గడుస్తున్నా గ్రీన్‌బెల్ట్‌లో కార్ల వ్యాపారాన్ని పట్టించుకోవడంతో పలు అధికారుల తీరుపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరో వైపు ఆక్రమణదారులు ఇసుకతోట గ్రీన్‌బెల్ట్‌లో మళ్లీ ఆక్రమణలకు పాల్పడుతున్నారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రీన్‌బెల్ట్ ఆక్రమణలు తొలగించడమే కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై ఆటో డ్రైవర్లకు శిక్షణ

మహారాణిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : నగరంలో రోడ్డు ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లకు శిక్షణ ఇస్తున్నట్టు సీపీ శంఖబ్రాత బాగ్చి తెలిపారు. గురువారం ఆయన పోలీసు కమిషనరేట్ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు శిక్షణా తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు కచ్చితంగా యూనిఫారం ధరించాలని, డ్రైవర్లకు అన్ని వివరాలతో కూడిన ఐడీ కార్డులు అందిస్తామని చెప్పారు. త్వరలో మన ఆటో, మన వైజాగ్ కార్యక్రమం చేపట్టనున్నట్టు తెలిపారు.

నడక కలిపిన బంధం

ప్రతిరోజూ కలుస్తున్న 25 మంది సభ్యులు

- 20 ఏళ్లుగా కొనసాగుతున్న స్నేహం
- వాకర్స్‌లో ఉన్నతాధికారులు, వ్యాపారవేత్తలు, వైద్యులు, పోలీసులు
- కలిసికట్టుగా వాకింగ్, ట్రెక్కింగ్, సుదూర ప్రయాణాలు
- సభ్యుల్లో తొణికిసలాడుతున్న మానసిక ఉల్లాసం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

ఒకరు డాక్టర్.. మరొకరు పోలీస్.. ఇంకొకరు వ్యాపారవేత్త.. మరొకరు బిల్డర్.. ఇలా ఒక్కొక్కరు ఒక్కో రంగానికి చెందిన వ్యక్తులు. అయితేనేం వీరిని ఆరోగ్యం కోసం చేసే వాకింగ్ కలిపింది. ఒకటి కాదు.. రెండు కాదు 20 ఏళ్లుగా 25 మంది సభ్యులతో కూడిన బృందం వాకింగ్, ట్రెక్కింగ్, జిమ్‌లో తరచూ కలుస్తూ స్నేహ బంధాన్ని కొనసాగిస్తున్నారు. అనుకోకుండా 20 ఏళ్ల కిందట వాకింగ్‌లో కలుసుకున్న వీరంతా గ్రూపుగా ఏర్పడి ఇప్పటికీ కొనసాగుతున్నారు. ఈ టీమ్‌కు పేరు కూడా పెట్టారు. తొలుత వాకింగ్ రాకర్స్ అని, ఆ తరువాత టీమ్ రాకర్స్‌గా మార్చారు. బృందంలోని సభ్యుల్లో ఎవరైనా ఒక్కరోజు రాకపోయినా మిగిలిన వారు వారింటికి వెళ్తారు. కారణం తెలుసుకుంటారు. కష్టమైతే తోడుగా నిలుస్తారు. సుఖాలను బృందంగా పంచుకుంటారు.


ట్రెక్కింగ్‌లో టీమ్ రాకర్స్

ఆరోగ్యం కోసం 20 ఏళ్ల కిందట పోర్టు స్టేడియంలో కొంతమంది ఉదయపు నడక (వాకింగ్) ప్రారంభించారు. వీరిలో ఇద్దరు ముగ్గురు కలిసి వాకింగ్ చేస్తుండగా అదే గ్రౌండ్‌కు వస్తున్న వారిని తమతో కలిసి నడవాలని ఆహ్వానించారు. అలా ఈ జాబితా 25కు చేరింది. వీరిలో విభిన్న రంగాల వారున్నారు. ఒకరు డాక్టర్, నలుగురు పోలీసు ఉన్నతాధికారులు, ఇద్దరు వ్యాపారవేత్తలు, బిల్డర్లు, ఆర్డీవో. ఏళ్ల గడిచినా వీరి ప్రయాణం ఆగలేదు. అప్పట్లో ఉన్నత స్థానాల్లో పనిచేసిన వారిలో చాలామంది ఉద్యోగ విరమణ చేశారు.

దైనందిన కార్యక్రమాలివి

బృంద సభ్యులు వారంలో మూడు రోజులు వాకింగ్ (ఆరు కిలోమీటర్లు), మూడు రోజులు జిమ్ చేస్తారు. మిగిలిన రోజు ట్రెక్కింగ్‌తోపాటు సుదూర ప్రాంతాలకు ప్రయాణించి మానసికోల్లాసం పొందుతుంటారు. కొన్నిసార్లు ఇతర రాష్ట్రాలకు వస్తారు. ఈ బృందంలో కొంతమంది ఒకేచోట అపార్టుమెంటు నిర్మించుకుని జీవిస్తున్నారు.

ఒక్కరైతే ఆగిపోయేది..

సాధారణంగా వ్యాయామం, జిమ్‌కు ఒంటరిగా వెళ్తే కొన్ని రోజులో వారాలో, నెలకో బ్రేక్ వస్తుంది. అదే గ్రూపుగా చేస్తే స్నేహితులతో గడిపేందుకు అయినా వెళ్లాలనిపిస్తుంది. కొన్ని కారణాల వల్ల ఎవరైనా వెళ్లలేకపోయినా మిగిలిన సభ్యులు గుర్తుచేస్తారు. ఒక్కరు రాకున్నా ఫోన్లు చేస్తారు. కారణం తెలుసుంటారు. బద్ధకమైతే ఉపేక్షించరు. బలమైన కారణమైతేనే మినహాయింపు ఉంటుంది.

కుటుంబం మాదిరి..

గ్రూపులోని సభ్యులంతా కుటుంబం మాదిరి ఉంటారు. శుభాశుభ కార్యక్రమాల్లో తోడుగా నిలుస్తారు. కష్టాన్ని పంచుకుంటున్నారు. అందరం కలిసి కుటుంబంలా కలిసిపోయామని, ఒక్కరోజు కలవకపోయినా ఏదో వెలితిగా ఉంటుందని డాక్టర్ మధుసూదన్ బాబు తెలిపారు. స్థాయి, హోదాలతో సంబంధం లేకుండా చిన్న పిల్లల్లా మారిపోతుంటారన్నారు. శారీరక ఆరోగ్యాన్నే కాకుండా ఈ బంధం మానసిక ఆరోగ్యాన్ని అందిస్తోందని వివరించారాయన.


పోర్టు స్టేడియంలో వాకింగ్ అనంతరం సేద తీరుతున్న సభ్యులు


బొర్రా గుహల వద్ద బృంద సభ్యులు

బాలికల సదన్ నుంచి ముగ్గురి తరలింపు

- రెండో రోజూ కొనసాగిన ఉద్రిక్తత
- మేట్రిన్‌ను విధుల నుంచి తొలగించిన అధికారులు

ఆరిలోవ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): విశాఖ వేలీ స్కూలు సమీపంలోని ప్రభుత్వ ప్రత్యేక బాలికల సదనం, పరిశీలన గృహంలో బాలికలు చేపట్టిన ఆందోళన రెండో రోజూ కొనసాగింది. హోంలో తమను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని, మేట్రిన్ అరాచకాలను తట్టుకోలేకపోతున్నామంటూ బుధవారం ఐదుగురు బాలికలు గోడదూకి రోడ్డుపైకి వచ్చి ఆందోళన చేసిన విషయం తెలిసిందే. వారంతా గురువారం కూడా తమ నిరసన తెలపడంతో హోం మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ ఎం ఎస్ హరేంధిర ప్రసాద్ ఆదేశాలతో అధికారులు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు చిల్డ్రన్ వెల్ఫేర్ కమిటీ సమావేశం నిర్వహించింది. దీంతో అలజడి సృష్టించిన బాలికల్లో ముగ్గురిని వారి స్వస్థలాలకు పంపినట్టు హోంసూపరింటెండెంట్ సునీత తెలిపారు. కృష్ణాజిల్లా చెల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆదేశాల మేరకు ఒక బాలికను ఆమె తల్లి నవ్వమ్మతో పంపించారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని సత్యసాయి అర్ఫన్‌హోంకు ఒకరిని, ప్రజ్వల హోంకి మరొకరిని పోలీసు భద్రత మధ్య గరువారం తరలించామన్నారు. ఆయా జిల్లాల నుంచి ఆదేశా లు వచ్చిన వెంటనే మరో ఇద్దరిని పంపిస్తామన్నారు.

మేట్రిన్‌పై చర్యలు

తమను శారీరకంగా, మానసికంగా మేట్రిన్ తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని, బలవంతంగా నిద్ర మాత్రలుమింగిస్తోందని బాలికలు ఆరోపించడంతో తాత్కాలిక ఉద్యోగిగా పనిచేస్తున్న మేట్రిన్ కుమారిని విధుల నుంచి తొలగించినట్టు సూపరింటెండెంట్ తెలిపారు. గురువారం కూడా బాలికలు రాళ్లను హోంపైకి విసిరారు. తమను వెంటనే స్వస్థలాలకు పంపాలని నినాదాలు చేశారు. దీంతో ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. బాలికలను డిప్యూటీ కలెక్టర్ జయదేవి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, నేషనల్ ఫెడరేషన్ ఇండియన్ వుమెన్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎ.విమలకుమారి, ఏఐవైఎఫ్ నాయకులు, పరామర్శించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధ్యక్షురాలు ఎంఆర్ఎల్ రాధ, బాలల హక్కుల కమిషన్ చైర్మన్ గొండు సీతారాం, సభ్యుడు కేసలి అప్పారావు, వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు హోం వద్ద పరిస్థితిని తెలుసుకున్నారు. సమస్యకు శాశ్వత పరిష్కారం లభించేలా చూస్తామని బాలికలకు హామీ ఇచ్చారు.

మార్చి నెలాఖరులోగా నిధులు ఖర్చుచేయాలి

- జడ్పీ సీఈవో నారాయణమూర్తి


మాట్లాడుతున్న సీఈవో

విశాఖపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ ఆధ్వర్యంలో పలు అభివృద్ధి పథకాలకు మంజూరుచేసిన నిధులు వచ్చే మార్చి నెలాఖరులోగా ఖర్చుచేయాలని సీఈవో పి. నారాయణమూర్తి స్పష్టంచేశారు. గురువారం జడ్పీ హాలులో ఉమ్మడి జిల్లా పరిధిలోని ఎంపీడీవోలు, ఏవోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలస్థాయిలో ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థంగా అమలుచేయడానికి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మండలాల్లో అన్ని రికార్డులు కచ్చితంగా నిర్వహించాలని, ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలన్నారు. బిల్లుల చెల్లింపుల కోసం ఈ-గ్రామ్ స్వరాజ్ ప్లాట్‌ఫాంను వినియోగించుకోవాలన్నారు. సమావేశంలో డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు రైల్వే ఉద్యోగులు


రెడ్డి శ్రీనివాసరావు


ఆనందకుమార్

విశాఖపట్నం, స్పోర్ట్సు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) : ప్రతిష్ఠాత్మక జాతీయ క్రీడలలో వాల్తేరు రైల్వే ఉద్యో గులు రెడ్డి శ్రీనివాసరావు, కేఆర్ ఆనందకుమార్ ప్రాతినిధ్యం వహించనున్నారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో జరిగే 38వ జాతీయ క్రీడల బాక్సింగ్ చాంపియన్‌షిప్ టోర్నీకి వాల్తేరు రైల్వే స్పోర్ట్సు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, ఇండియన్ రైల్వే బాక్సింగ్ కోచ్ రెడ్డి శ్రీనివాస్ టెక్నికల్ అఫిషియల్‌గా వ్యవహరించనున్నారు. అలాగే ఈ నెల 28 నుంచి జరిగే జాతీయ క్రీడల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ బీచ్ వాలీబాల్ జట్టుకు కేఆర్ ఆనందకుమార్ కోచ్‌గా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా పలువురు రైల్వే క్రీడాకారులు హర్షం ప్రకటించారు.

జాతీయ చెస్ టోర్నీలో నయినకు రన్నరప్ ట్రోఫీ


ట్రోఫీతో గొర్లి నయిన

విశాఖపట్నం, స్పోర్ట్సు, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జాతీయ అండర్-15 బాలికల చదరంగం పోటీల్లో నగరానికి చెందిన గొర్లి నయిన ద్వితీయ స్థానం సాధించింది. పెద్దాపురంలో జరిగిన టోర్నీలో నయిన తొమ్మిది రౌండ్లకు ఏడు రౌండ్లలో విజయం సాధించి ద్వితీయ స్థానంలో రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా చదరంగం సంఘం ప్రతినిధులు, చెస్ క్రీడాకారులు పలువురు నయినను అభినందించారు.

పబ్లిసిటీ కోసమే సీఎం దావోస్ పర్యటన

- వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



విశాఖపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబునాయుడు తన బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుకోవడానికే దావోస్ పర్యటనకు వెళ్లారని మాజీ మంత్రి, వైసీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ విమర్శించారు. పెట్టుబడులు తీసుకొస్తామంటూ దావోస్ వెళ్లి తండ్రీకొడుకులు ఉత్తిచేతులతో రాష్ట్రానికి వచ్చారన్నారు. దావోస్‌లో రాజకీయ ప్రసంగాలు, లోకేశ్ భజనతోనే పర్యటన ముగించారన్నారు. రూకోట్లు వెచ్చించి పర్యటనకు వెళ్లి ఎన్ని కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చారో చెప్పాలన్నారు. రాష్ట్రంలో పెట్టుబడిదారులను వేధించారని, దావోస్‌లో కూడా రెడ్‌బుక్ గురించి మాట్లాడడం విచారం కలిగించిందన్నారు. ఒక్కహామీనీ కూటమి ప్రభుత్వం అమలుచేయలేదన్నారు.

సెంట్రల్ జైల్లో ఖైదీలకు ఖైనీ ప్యాకెట్లు!

- సరఫరా చేస్తున్న ఇన్‌స్ట్రక్టర్ నాగేశ్వరరావు సస్పెన్షన్

ఆరిలోవ, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): కేంద్ర కారాగారంలో ఖైదీలకు ఖైనీ ప్యాకెట్లను సరపరా చేస్తున్న ఫ్యాక్టరీ ఇన్‌స్ట్రక్టర్ నాగేశ్వరరావును అదుపులోకి తీసుకుని, విధుల నుంచి సస్పెండ్ చేసినట్టు సూపరింటెండెంట్ మహేష్‌బాబు తెలిపారు. సెంట్రల్ జైలులో ఖైదీలకు ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావు గురువారం ఉదయం విధులకు హాజరయ్యే సమయంలో సిబ్బంది తనిఖీ చేశారు. అతడి అండర్‌వేర్‌లో ఖైనీ ప్యాకెట్‌ను గుర్తించి, అదుపులోకి తీసుకున్నారు. కాగా ఇక్కడ పదేళ్లుగా పనిచేస్తున్న నాగేశ్వరరావు కొంతకాలంగా జైలులోని ఖైదీలకు ఖైనీ ప్యాకెట్లు సరఫరా చేస్తున్నట్టు తేలింది. నాగేశ్వరరావును విధుల నుంచి సస్పెండ్ చేశామని, ఎంతకాలంగా ఖైనీ ప్యాకెట్ల సరఫరా జరుగుతుందో దర్యాప్తులో తెలుస్తుందని సూపరింటెండెంట్ తెలిపారు.

నేటి నుంచి కొత్తపల్లి జలపాతం మూసివేత

పాడేరురూరల్, జనవరి 23 (ఆంధ్రజ్యోతి) జి.మాడుగుల మండలంలోని కొత్తపల్లి జలపాతంలో ఈ నెల 24 నుంచి 27వ తేదీ వరకు పర్యాటకుల ప్రవేశాన్ని రద్దు చేశామని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు రోజుల పాటు ఆధునికీకరణ పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నెల 27వ తేదీ వరకు పర్యాటకులను జలపాతంలోకి అనుమతించవద్దని ఎకో టూరిజం సిబ్బందిని ఆదేశించినట్టు ఆయన పేర్కొన్నారు. పర్యాటకులు ఈ విషయాన్ని గమనించి జలపాతం సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

కమిషనరేట్‌కు డీఎస్వో బదిలీ

విశాఖపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): జిల్లా పౌరసరఫరాల అధికారి వి. భాస్కరరావు విజయవాడలోని పౌరసరఫరాల కమిషనర్ కార్యాలయానికి డిప్యూటేషన్‌పై వెళ్లనున్నారు. ఐదు నెలల క్రితం సాధారణ బదిలీల్లో కమిషనరేట్ నుంచి విశాఖ డీఎస్‌వోగా వచ్చారు. ఇప్పుడు ఆయన తిరిగి కమిషనరేట్‌కు వెళ్లేందుకు ఉత్తర్వులు వెలువడ్డాయి. సహాయ పౌరసరఫరాల అధికారి కల్యాణికి డీఎస్‌వోగా బాధ్యతలు అప్పగించారు.

చిట్టీల పేరుతో మోసగించిన షిప్‌యార్డు ఉద్యోగి అరెస్టు

మల్కాపురం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): చిట్టీల పేరుతో మోసం చేసిన వ్యక్తిని గురువారం మల్కాపురం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలిలా ఉన్నాయి. షిప్‌యార్డు ఉద్యోగి నీలాతి రవికుమార్ 2020లో అనేక మంది ఉద్యోగుల నుంచి చిట్టీల పేరుతో సుమారు రూ.70 లక్షల వరకు వసూలు చేశాడు. అయితే ఆ సమయంలో కొవిడ్ రావడంతో చిట్టీలకు బ్రేక్ పడింది. అప్పటివరకు నగదు చెల్లించిన వారంతా తమ డబ్బులను తిరిగి చెల్లించాలంటూ రవికుమార్‌ను అడిగితే తప్పించుకుని తిరిగేవాడు. దీంతో వారంతా 2022లో రవికుమార్‌పై మల్కాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటినుంచి పరారీలో ఉన్న రవికుమార్ కోసం పోలీసులు వెతుకుతుండగా, గురువారం నాతయ్యపాలెంలో పట్టుబడ్డాడు. ఈ మేరకు పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారని తెలిపారు.

టీడీపీ కార్యాలయంలో ఘనంగా మంత్రి లోకేశ్ జన్మదినోత్సవం

మహారాణిపేట, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని గురువారం నాయకులు ఘనంగా నిర్వహించారు. స్టేట్ కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్, పార్టీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఎంపీ శ్రీభరత్ కేక్ కట్ చేసి, అందరికీ పంచిపెట్టిరు. అనంతరం ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు చైర్మన్ సీతంరాజు సుధాకర్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ యువగళం పాదయాత్రతో తెలుగుదేశం పార్టీని విజయం దిశగా నడిపించిన ఘనత లోకేశ్‌కే దక్కుతుందన్నారు. వైసీపీ నుంచి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్ని ప్రజల కోసం రాష్ట్రమంతా పాదయాత్ర చేసి వారి సమస్యలు తెలుసుకున్నారన్నారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీకి కోటిమంది సభ్యత్వం లభించడం వెనుక లోకేశ్ కృషి ఉందన్నారు. గండి బాబ్జీ మాట్లాడుతూ పార్టీ ఎగుదలలో లోకేశ్ పాత్ర అజరామరమన్నారు. 15 ఏళ్ల కష్టంతో సొంతంగా ఎదిగిన రాజకీయ నాయకుడు లోకేశ్ అని కీర్తించారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పార్టీ భీమిలి ఇన్‌చార్జి కోరాడ రాజబాబు, నేతలు అక్కరమాని విజయనిర్మల, పొలమరశెట్టి శ్రీనివాస్, విల్లూరి భాస్కరరావు, ఎం.శ్రావణి, ఎర్నాగుల జగదీశ్, రాజమడ్రి నారాయణ, లొడగల కృష్ణ, వీఎస్ఎన్ మూర్తియాదవ్, తమ్మిన విజయకుమార్, సారిపల్లి మహేశ్, విల్లూరి చక్రవర్తి కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎంపీ శ్రీభరత్‌కు కేకు తినిపిస్తున్న టీడీపీ మహిళా నాయకులు

28 నుంచి రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలల క్రీడలు

కంచరపాలెం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 28వ తేదీ నుంచి నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్, స్పోర్ట్స్ పోస్టర్‌ను సాంకేతిక విద్య రీజనల్ జాయింట్ డైరెక్టర్ జె.సత్యనారాయణ మూర్తి, ఉత్తరాంధ్ర మూడు జిల్లాలకు చెందిన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని కలిగించేందుకు ప్రతి రెండేళ్లకు ఒకసారి ఇటువంటి మీట్స్‌ను నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు పోటీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. కో-ఆర్డినేటర్ డా.కె.నారాయణరావు మాట్లాడుతూ ఈ మీట్‌లో 13 రీజన్స్ నుంచి సుమారు 1600 మంది విద్యార్థులు పాల్గొననున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో కెమికల్ కళాశాల ప్రిన్సిపాల్ డా. కేవీ రమణ, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ బి.జానకిరామయ్య పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న సాంకేతిక విద్య ఆర్జేడీ సత్యనారాయణ, కళాశాలల ప్రిన్సిపాల్స్

విద్యార్థులకు పాఠాలు బోధించిన ఎంపీ శ్రీభరత్


తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న ఎంపీ శ్రీభరత్

సీతమ్మధార, జనవరి 23, (ఆంధ్రజ్యోతి): ఎంపీ శ్రీభరత్ గురువారం ఉపాధ్యాయుడి అవతారం ఎత్తారు. 24వ వార్డు పిఅండ్‌టి కాలనీలో గల ఎన్ఎంసీహెచ్ స్కూల్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఎంపీ కొద్దిసేపు తరగతి గదిలో పాఠాలు బోధించారు. విద్యార్థులకు అభ్యసన పద్ధతులు, ఉపాధ్యాయుల బోధనా తీరుపై పలు సూచనలిచ్చారు. విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేయించి వేడుకలను నిర్వహించారు. ప్రతి ఒక్కరికీ సమాన విద్యను అందించడం ప్రభుత్వ బాధ్యత, లోకేశ్ యువనాయకత్వం విద్యారంగానికి దిశానిర్దేశం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు గండి బాబ్జీ, నేతలు వెల్లంకి భరత్, బర్ల బాలకృష్ణ, గొంప ధర్మారావు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

75 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ


జాతీయ జెండాతో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

సీతంపేట, జనవరి 23, (ఆంధ్రజ్యోతి): గణతంత్ర దినోత్సవం సన్నాహాల్లో భాగంగా గురువారం లంకపల్లి బుల్లయ్య కళాశాల విద్యార్థులు, ఎన్‌సీసీ, ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, ఎన్ఎస్ఎస్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కలిసి 75 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీని నిర్వహించారు. కళాశాల నుంచి వీఐపీ రోడ్డు, జీవీఎంసీ గాంధీ విగ్రహం రామాటాకీస్ రోడ్డు మీదుగా కళాశాలకు చేరారు. ప్రిన్సిపాల్స్ డాక్టర్ జీఎస్‌కే చక్రవర్తి, సోమేశ్వరరెడ్డి, దీపక్‌చౌదరి, బ్రహ్మానందరెడ్డి, ప్రభా గోస్వామి, చైతన్య, లక్ష్మణబాబు పాల్గొన్నారు.





నగరంపై మంచు దుప్పటి


సింహాచలం కొండపై గురువారం ఉదయం కురుస్తున్న మంచు

విశాఖపట్నం, జనవరి 23 (ఆంధ్రజ్యోతి): నగరం, పరిసరాల్లో గురువారం ఉదయం దట్టంగా మంచు కురిసింది. తెల్లవారుజాము నుంచి ఉదయం పదిగంటల వరకు మంచు కొనసాగింది. ఉదయపూట ఆరుబయట పనులకు వెళ్లే వాహన చోదకులకు అంతరాయం ఏర్పడింది. విజిబిలిటీ తక్కువగా ఉండడంతో బస్సులు, భారీ వాహనాలు నెమ్మదిగా నడిపారు. విశాఖ ఎయిర్‌పోర్టులో ఉదయం ఎనిమిది గంటలలోపు గాలిలో తేమశాతం 100గా నమోదుతో రన్‌వేపై విజిబిలిటి 1200 మీటర్లకు పడిపోయింది. మంచుకు తోడు చలి ప్రభావం కొనసాగింది. ఎయిర్‌పోర్టులో 17 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది.